RNI Reg-No. 69176/96

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Medchal Malkajgiri

CIRCULATED THROUGHOUT TELANGANA STATE

సంపుటి :31 సంచిక : 244 హైదరాబాద్ సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: బుధవారం 08-04-2026 పేజీలు : 12 వెల: 1-00

## హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగర కమిషనరేట్ పరిధిలో భారీగా డ్రగ్స్‌ను పట్టుకున్నారు. చిలకలగూడ, ఆదిభట్ల పోలీసులు జాయింట్ ఆపరేషన్ చేపట్టారు. రూ.64.35 లక్షల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని.. ఐదుగురిని అరెస్టు చేశారు.



# విజయన్, మోడీ మంచి మిత్రులు

- రాష్ట్ర యువతను మోసం చేస్తున్న పినరయ్
- కేరళంలో ఇక ఎల్‌డిఎఫ్‌కు కాలం చెల్లింది
- ప్రచారంలో సిఎం రేవంత్ రెడ్డి విమర్శలు

**తిరువనంతపురం, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** కేరళ ప్రజలను పినరయి విజయన్ మోసం చేస్తున్నారని కేరళ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోమారు విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పినరయి విజయన్.. మోదీ నుంచి సూచనలు తీసుకుంటున్నారు. వారి మధ్య ఒప్పందం ఉంది. కేసుల నుంచి మోదీ

మిగతా 2లో..

## కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

బిఆర్ఎస్, బిజెపిలకు అధికారం కల్ల

నాగర్ కర్నూలు కాంగ్రెస్ కార్యక్రంలో పిసిసి చీఫ్



**నాగర్ కర్నూల్, ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుం టున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందని మహేశ్ కుమార్ గౌడ్

మిగతా 2లో..

## భారత్ ధర్మసత్రం కాదు

బరాక్ లోయలో ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా




**బరాక్, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో ఆయా రాష్ట్రాల్లో ప్రచారం జోరుగా సాగుతోంది. తాజాగా అస్సాంలోని బరాక్ లోయలో జరిగిన ఎన్నికల ప్రచారంలో కేంద్రమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అక్రమ చొరబాటుదారుల ప్రస్తావన తీసుకొచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో అభివృద్ధి జరగాలన్నా, అక్రమ చొరబాటుదారులను తరిమికొట్టాలన్నా అది భాజపా వల్లే సాధ్యం అవుతుందని పేర్కొన్నారు. భాజపా అధికారం లోకి వస్తేనే ఇవన్నీ జరుగుతాయన్నారు. బరాక్ లోయలో బెంగాలీలు ఎక్కువగా ఉంటారు. దీంతో ఆయన బెంగాల్‌లో అక్రమ చొరబాటుదారుల అంశాన్ని పేర్కొనడం గమనార్హం. "పౌరసత్వ

మిగతా 2లో..

## బెంగాల్‌పై కన్నేస్తే..పాక్ ముక్కలే

పాక్ రక్షణ మంత్రి ఖవాజా వ్యాఖ్యలకు కౌంటర్

రెచ్చగొట్టే ప్రకటనలై మండిపడ్డ రాజ్‌నాథ్ సింగ్



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** పాకిస్థాన్‌కు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. బెంగాల్‌పై కన్నేస్తే ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలంటూ హెచ్చరికలు చేశారు. భవిష్యత్తులో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే.. కోల్‌కతానూ లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల కవ్వింపులకు పాల్పడ్డారు. కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు. ఈ వ్యాఖ్యలపైనే తాజాగా రాజ్‌నాథ్ ఘాటుగా స్పందించారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యల వల్లనే

మిగతా 2లో..

## ఐపీఎల్ పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

- బెట్టింగ్ యాప్ ఉచ్చులో పడకండి
- నగర పోలీస్ కమిషనర్ సజ్జన్నార్ హెచ్చరిక



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఐపీఎల్ మ్యాచ్‌ల పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు పెరిగి పోతున్నాయని... ఈ ఉచ్చులో పడవద్దని హైదరాబాద్ సిటీ పోలీస్

మిగతా 2లో..

## ట్రంప్ డెడ్‌లైన్ వేళ.. ఇరాన్ 'కిరీటం' ఖర్గ్‌పై దాడులు



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** ఇరాన్ ఆర్థిక కిరీటమైన ఖర్గ్ ఐలాండ్ పై మరోసారి దాడులు జరిగాయని స్థానిక మీడియా వెల్లడించింది. హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు విధించిన గడువుకు కొన్ని గంటలే మిగిలి ఉన్నవేళ ఖర్గ్‌తో పాటు ఆ దేశంలోని రహదారులు, రైల్వే వంతెనలపై భారీ దాడులు చోటుచేసుకున్నాయి. ద్వీపంలోని మిలిటరీ టార్గెట్లపైనా అమెరికా-ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించాయి. మార్చినెలలో కూడా

మిగతా 2లో..

## రేవంత్‌తో చర్చకు దిగే ఉద్దేశం లేదు

కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్



**తిరువనంతపురం, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందించారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ) సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల


మిగతా 2లో..

## శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

9మంది జడ్జిల సుప్రీం విస్తృత ధర్మాసనం విచారణ

ప్రాచీన ఆచారాలు కేవలం మత విశ్వాసాలకు సంబంధించినవే

ఇందులో మహిళల పట్ల వివక్ష లేదని కేంద్రం వాదన



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** ప్రాచీన కాలం నుంచి కొనసాగుతోన్న సంప్రదాయాలకు అనుగుణంగానే శబరిమల ఆలయంలో మహిళలకు ప్రవేశ నిషేధం విధించారు కానీ.. దీనికి సంబంధించి వివక్ష ఏమీ లేదని కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. మహిళల ప్రవేశాన్ని అనుమతించడమనేది ఆరాధనా స్వరూపాన్నే మార్చివేస్తుంది. ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా శతాబ్దాలుగా భక్తులు స్వామిని పూజిస్తున్నారని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వెల్లడించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి గతంలో వెలువడిన తీర్పును మంగళవారం జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని 9 మంది జడ్జీల ధర్మాసనం సమీక్షిస్తోంది. ఈమేరకు పిటిషన్‌దారుల వాదనలు వింటోంది. దీనికి ముందు కేంద్రం తన వివరణను సమర్పించింది. ఈ అంశం పూర్తిగా మత విశ్వాసాలకు సంబంధించినదని పేర్కొన్నారు. న్యాయసమీక్షకు అతీతమైందని వాదించారు. శబరిమల ఆలయంలో మహిళల ప్రవేశానికి సంబంధించి ఉన్న ఆంక్షలు కొనసాగించాలని సుప్రీంకోర్టును కోరారు. శబరిమల అయ్యప్ప ఆలయంలోకి 10-50 ఏళ్ల వయసున్న మహిళల ప్రవేశంపై నిషేధాన్ని రద్దు చేస్తూ 2018లో సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పుపై పలు రివ్యూ పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ

మిగతా 2లో..

## ఐదు రాష్ట్రాల్లో ఎగ్జిట్ పోల్స్ నిషేధం

9వ తేదీ నుంచి 29 వరకు అమలు... కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన విడుదల




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఎగ్జిట్ పోల్స్‌పై ఎన్నికల కమిషన్ నిషేధం విధించింది. ఏప్రిల్ 9వ తేదీ ఉదయం 7.00 గంటల నుండి ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం 6.30గంటల వరకు ఎగ్జిట్ పోల్స్ సర్వే నిర్వహించడం, వాటి ఫలితాలను వెల్లడించకూడదని ఎన్నికల కమిషన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ నిర్దిష్ట సమయంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించడం లేదా వెల్లడించడం ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 126ఎను ఉల్లంఘించడమేనని హెచ్చరించింది. ఉల్లంఘించిన వారికి రెండేళ్ల కఠిన కారాగారశిక్ష లేదా జరిమానా , లేదా రెండూ అమలు చేయవచ్చని ఆ ప్రకటనలో తెలిపింది.కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా కేరళ, అస్సాం రాష్ట్రాల్లో ఏప్రిల్ 9న, తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమబెంగాల్‌లో రెండు దశల్లో ఏప్రిల్ 23, 29 తేదీల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల ఫలితాలు ఏప్రిల్ 30 వెలువడనున్నాయి. కేరళ, పుదుచ్చేరిల్లో మంగళవారం సాయంత్రం 6.00గంటలకు ప్రచారాన్ని నిలిపివేయాల్సి వుండగా, అస్సాంలో సాయంత్రం 5.00గంటల నుండి నిషేధం అమలు కానుంది. పరిమిత సంఖ్యలో పార్టీ కార్యకర్తలు లేదా అభ్యర్థి ఇంటింటికి వెళ్లి చేసే ప్రచారం మినహా, మరే ఇతర ప్రచారానికి అనుమతి లేదు.

మొదటి పేజీ తరువాయిలు

## కాంగ్రెస్ కోసం సైనికుల్లా పనిచేయాలి

అన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా ఆయన సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కేంద్రాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని వివరించారు. అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు ఇచ్చామని పీసీసీ చీఫ్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని టీ పీసీసీ చీఫ్ చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలకు టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నలు సంధించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుస్తుందని ఆయన తెలిపారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భారత్ ధర్మసత్రం కాదు

సవరణ చట్టం ప్రకారం గూఢచర్యం చేసే వ్యక్తులకు దేశంలో స్థానం లేదని తెలిసే ఆ చట్టాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోంది. రెడ్ కార్పెట్ వేసి మరీ అక్రమ చొరబాటుదారులకు ప్రవేశం కల్పిస్తోంది. భారత్ ధర్మసత్రం కాదు. అక్రమ చొరబాటుదారులకు ఇక్కడ స్థానం లేదు. ఒక్కసారి భాజపా అధికారంలోకి రాగానే రాష్ట్రంలో మార్పు మొదలవుతుంది. బెంగాల్‌లో ఉన్న చొరబాటుదారులను తిరిగి వారి దేశాలకు వెళ్లగొడతాం" అని అమిత్ షా పేర్కొన్నారు. "కాంగ్రెస్ నేతలకు అసలు ప్రజల కష్టాలు తెలుసుకోవాలనే ఉద్దేశం ఉండదు. నిరసనకారులను మెచ్చుకుంటూ రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారు. దీంతో ఆ పార్టీ ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు" అని పేర్కొన్నారు.

## ఐపీఎల్ పేరుతో ఆన్‌లైన్ బెట్టింగ్ మోసాలు

కమిషనర్ సజ్జనార్ హెచ్చరిక జారీ చేశారు. ఆన్‌లైన్ బెట్టింగ్‌పై సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సీపీ స్పందించారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ క్రికెట్ ప్రిడిక్షన్ ఛానెల్స్ దందా చేస్తున్నాయని.. టాస్, మ్యాచ్ ఫలితాలు ముందే చెబుతామని అమాయకులను బెట్టింగ్ ఉచ్చులోకి లాగుతూ మోసం చేస్తున్నాయని సీపీ తెలిపారు. ఇన్‌ఫ్లుయెన్సర్లు కూడా ఈ అసత్య ప్రచారాల్లో పాల్గొంటున్నారని అన్నారు. ఈ ఫేక్ ప్రిడిక్షన్ ఛానెల్స్.. ముందుగా ఎన్‌రోల్ చేయించి, తర్వాత బెట్టింగ్ యాప్‌ల లింకులు పంపి మోసం చేస్తున్నాయని సజ్జనార్ అన్నారు. బెట్టింగ్ వల్ల కష్టపడి సంపాదించిన డబ్బును అమాయకులు కోల్పోతున్నారని ఆయన చెప్పారు. ఫేక్ ప్రిడిక్షన్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దని సీపీ హెచ్చరించారు. ఫేక్ ప్రిడిక్షన్‌లు, బెట్టింగ్‌లపై హైదరాబాద్ సైబర్ క్రైమ్ విభాగం కఠిన చర్యలు తీసుకుంటుందని సీపీ తెలిపారు. ఇప్పటివరకు 494 పెయిడ్ యాడ్స్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు బ్లాక్ చేశారని సీపీ చెప్పారు. సోషల్ మీడియాలో 129 ఫేక్ ప్రొ÷ఫైళ్లను తొలగించారన్నారు. బెట్టింగ్ యాప్‌లపై నిరంతర నిఘా ఉంటుందని స్పష్టం చేశారు. మోసపూరిత యాడ్స్ కనిపిస్తే వెంటనే రిపోర్ట్ చేయాలని ప్రజలను సీపీ కోరారు. సైబర్ మోసం జరిగితే వెంటనే 1930కి ఫోన్ చేయాలని లేదా ఞాశిసఞసతిపు.ఐనీల.తిని వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని సీపీ సజ్జనార్ పేర్కొన్నారు.

## రేవంత్‌తో చర్చకు దిగే ఉద్దేశం లేదు

ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు. కేరళ, పుదుచ్చేరి, అస్సాంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగిసింది. గురువారం పోలింగ్ నిర్వహించనున్నారు. మే 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

## ట్రంప్ డెడ్‌లైన్ వేళ.. ఇరాన్ 'కిరీటం' ఖర్గ్‌పై దాడులు

అమెరికా ఓసారి ఈ ప్రాంతంలో దాడులు చేసింది. పర్షియన్ గల్ఫ్‌లో ఖర్గ్ ఒక చిన్న ద్వీపం. ఇరాన్ తీరానికి 25-30 కి.మీ దూరంలో ఉండే ఇది.. ఆ దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకం. ఇరాన్ తమ చమురు ఎగుమతుల్లో 90 శాతం ఇక్కడి నుంచే నిర్వహిస్తోంది. 1986 నుంచి ఇక్కడ విదేశీ పెట్టుబడులు పెరగడంతో.. ఇరాన్ ఇంధన ఎగుమతులకు కీలకంగా మారింది. కాగా.. హర్మూజ్ జలసంధిని తెరిపించేలా ఒత్తిడి తెచ్చేందుకు ఖర్గ్‌ను ఓ సాధనంగా వాడాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తోంది. ఆ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అగ్రరాజ్యం భారీగా బలగాలను మోహరించింది కూడా. అమెరికా భూతలదాడులకు దిగొచ్చన్న అంచనాలున్నాయి. వాటిని తిప్పికొట్టేందుకు ఇరాన్ సిద్ధమవుతోంది. తాజా దాడుల నేపథ్యంలో ఇజ్రాయెల్-అమెరికాకు ఇరాన్ (×తీఖఅ) హెచ్చరికలు చేసింది. ఇన్నాళ్లు యుద్ధం ముగింపు గురించి ఓపికతో ఎదురు చూశామని..ఇక తమ సహనం నశించిందని ఐఆర్‌జీసీ పేర్కొంది. అమెరికా, ఇజ్రాయెల్ సహా వాటి మిత్ర దేశాలపై దాడులు చేస్తామని వెల్లడించింది.

# విజయన్, మోడీ మంచి మిత్రులు

(మొదటి పేజీ తరువాయి)

ఆయనను రక్షిస్తున్నారు. రాష్ట్రంలో యువతను విజయన్ మోసం చేస్తున్నారు. కేరళ ప్రజల నుంచి నాకు ఫీడ్‌బ్యాక్ వచ్చింది. విజయన్‌కు కేసీఆర్ మంచి మిత్రుడు. కేసీఆర్ పాలన గురించి విజయన్ ప్రస్తావించారని రేవంత్ అన్నారు. కేరళం యువత హార్డ్ వర్కింగ్ పీపుల్ అని సీఎం రేవంత్‌రెడ్డి కొనియాడారు. తాజాగా కేరళం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సీఎం రేవంత్ అక్కడి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గల్ఫ్ దేశాల అభివృద్ధిలో కేరళం యువత పాత్ర కీలకమన్నారు. కేరళంలోనే విషాద స్టోరీలకు యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ ప్రభుత్వం చరమాంకం పలుకుందన్నారు. యూడీఎఫ్ గవర్నమెంట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పినరయి విజయన్ అంటే తనకు గౌరవమని.. కానీ ఆయన ప్రభుత్వం అంటే తనకు నచ్చదన్నారు. ఊమెన్ చాండీ కరుణాకరన్ ఆధ్వర్యంలో కేరళ అభివృద్ధి చెందిందన్నారు. కేరళంకు పినరయి విజయన్, మోడీలు వద్దు. పినరయి విజయన్ జ్యోతి బసు, సోమనాథ్ చటర్జీలను మరచిపోయి చాలా కాలం అయ్యింది. ఎన్డీఏ తరపున పినరయి విజయన్ కేరళంలో పని చేస్తున్నారు. కేరళంలో ప్రతి సమస్యకు కారణం పినరయి విజయన్. గత పదేళ్లుగా పినరయి విజయన్ కాకుండా మరో వామపక్ష నేత లీడర్‌గా లేరు. 2023కు ముందు తెలంగాణను తాను తప్ప ఎవరు నడిపించ లేరు అని పినరయి విజయన్ స్నేహితుడు కేసీఆర్ అనుకున్నారు. కానీ కాంగ్రెస్ వచ్చి తెలంగాణలో అభివృద్ధి చేస్తోంది. కేరళంలో యూడీఎఫ్ వచ్చి పినరయి విజయన్ కోటను బద్దలు కొడుతుంది. మోడీ పినరయి విజయన్ పేరుతో కేరళంలోకి ఎంటర్ అవుతున్నారు. మోడీ, పినరయి విజయన్ ఇద్దరూ బ్రదర్స్. కేరళంలో పినరయి, ఢిల్లీలో మోడీ మంచి మిత్రులని సీఎం రేవంత్ విమర్శలు గుప్పించారు.

# బెంగాల్‌పై కన్నేస్తే..పాక్ ముక్కలే

(మొదటి పేజీ తరువాయి)

55 ఏళ్ల క్రితం పాక్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుచేశారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి విడిపోయి బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఏర్పడింది. నాడు బంగ్లా విముక్తి పోరాటానికి భారత సైన్యం అండగా నిలిచింది. ఉద్రిక్తతలను పెంచే ప్రకటనలు చేయవద్దని ఇస్లామాబాద్‌ను ఆయన హెచ్చరించారు. వారు బెంగాల్‌పై కన్నేస్తే.. ఈసారి పాక్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలి అని వ్యాఖ్యానించారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# శబరిమలలో మహిళల ప్రవేశంపై నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

క్రమంలోనే 9 మంది సభ్యుల విస్తృత ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. శబరిమల ఆలయంలో మహిళల ఎంట్రీ అంశంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్నది. 9 మంది సభ్యుల ధర్మాసనం విభిన్న కోణాల్లో ఈ అంశాన్ని విచారిస్తున్నది. సుప్రీం ధర్మాసనంలో సీజేఐ సూర్యకాంత్‌తో పాటు జస్టిస్ బీవీ నాగరత్న, ఎంఎం సుందరేశ్, అషానుద్దిన్ అమానుల్లా, అరవింద్ కుమార్, ఆగస్టిన్ జార్జ్ మాసి, ప్రసన్న బి వర్లే, ఆర్ మహాదేవన్, జోయ్‌మాల్యా బాగ్చీ ఉన్నారు. 10 నుంచి 50 ఏళ్ల వయసున్న మహిళలకు శబరిమల ఆలయంలోకి ప్రవేశం లేదన్న అంశంతో పాటు మరికొన్ని అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తున్నది. అయితే సుప్రీం ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని స్పష్టం చేసింది. కేరళలోని శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశం విషయంలో ఉన్న నిబంధనలను కేంద్ర ప్రభుత్వ సమర్థించింది. అయితే ఆ అంశం మత విశ్వాసాలకు చెందుతుందని, మతం పరిధిలోకి వస్తుందని, జుడిషియల్ పరిధిలోకి ఇది రాదని ప్రభుత్వం చెప్పింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఏదైనా అశాస్త్రీయ విధానం ఉంటే, దాన్ని శాసనాల ద్వారా పరిష్కరించుకోవచ్చు అన్నారు. ప్రతి మతపరమైన విధానాన్ని గౌరవించాలని, ప్రతి అంశాన్ని హుందాతనానికి, శరీర స్వేచ్ఛకు ఆపాదించలేమన్నారు. మసీదుకు వెళ్లినా, గురుద్వారకు వెళ్లినా.. ముఖాన్ని కప్పుకోవాల్సి వస్తుందని, అప్పుడు నా గౌరవాన్ని, హక్కును లాక్కున్నారని అనలేమని తుషార్ మెహతా చెప్పారు. మతపరమైన స్వేచ్ఛను రాజ్యాంగం రక్షిస్తుందన్నారు.

# వచ్చే మూడ్రోజులు తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

### పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు రాష్ట్రాల్లో వచ్చే మూడు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. తాజా వివరాల ప్రకారం.. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని పలు జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉంది. ఉత్తరాంధ్ర, కోస్తాంధ్ర ప్రాంతాల్లో మేఘావృత వాతావరణంతో పాటు ఎడతెరిపి లేకుండా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. ఇక తెలంగాణలోనూ పలు జిల్లాల్లో వర్షాలు పడనున్నాయి. భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, నల్గొండ, ఖమ్మం జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉండగా, సూర్యపేట, వరంగల్, జనగామ, సిద్దిపేట జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడే సూచనలు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో బహిరంగ ప్రదేశాల్లో తిరగకూడదని సూచించారు. రైతులు, ప్రయాణికులు సైతం వాతావరణ పరిస్థితులను గమనించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎకువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఉండకూడదు. ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు. వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది. పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి.

# రైతుల భూములు లాక్కునే యత్నం దుర్మార్గం

- ఇండస్ట్రియ్ పార్క్ పేరుతో భూ దందా
- బిఆర్ఎస్ నేతలను నిర్బంధించడం దుర్మార్గం
- హరీష్ రావు తదితరుల అరెస్ట్‌పై కెటిఆర్ ఆగ్రహం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలోని కాళ్లాపూర్, రాపోలు గ్రామాల్లో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి 1200 ఎకరాల భూమిని బలవంతంగా లాక్కోవడాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుపట్టారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలేసి పేదల భూములపై పడిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని ఆయన అభివర్ణించారు. రైతు భరోసా, రుణమాఫీ, ఆరు గ్యారెంటీలు 420 హామీలను అమలు చేయకుండా రైతులను అరిగోస పెడుతున్న ప్రభుత్వం, ఇప్పుడు పరిశ్రమల పేరుతో భూ సేకరణకు దిగడం దుర్మార్గమని పేర్కొన్నారు. గత రెండున్నరేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా తీసుకురాని ఈ సర్కార్, భూములను దోచుకోవడంలో మాత్రం విపరీతమైన ఆసక్తి చూపిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు దొంగల్లా ఊళ్లు పంచుకుంటున్నట్లు భూములను కబ్జా చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్త కాదని, ఉద్యమ కాలం నుంచే ఇవన్నీ ఎదుర్కొని ప్రజల పక్షాన నిలబడ్డామని కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరింపులకు ఎవరూ భయపడేది లేదని, ప్రజల పక్షాన పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రభుత్వం ఎంత అణచివేతకు పాల్పడినా, బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. అక్రమంగా నిర్బంధించిన నాయకులను వెంటనే విడుదల చేయాలని, భూ సేకరణను తక్షణమే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొన్న లారీ

### పదిమంది విద్యార్థులకు స్వల్ప గాయాలు

**ఖమ్మం, ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఖమ్మం రూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఓ ప్రైవేటు పాఠశాల బస్సును వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 20 మంది విద్యార్థులు ఉన్నారు. వీరిలో 10 మంది విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. అదృష్టవశాత్తూ ప్రాణాపాయం తప్పడంతో తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యం ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన విద్యార్థులను బస్సు నుంచి బయటకు తీశారు. ఈ ఘటనపై పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వేగంగా సహాయక చర్యలు చేపట్టారు. విద్యార్థులను చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనా స్థలానికి చేరుకున్న ఖమ్మం రూరల్ పోలీసులు ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు, లారీని స్వాధీనం చేసుకుని తదుపరి దర్యాప్తు జరుపుతున్నారు. పాఠశాల వాహనాల డ్రైవర్లు , భారీ వాహనాల డ్రైవర్లు రద్దీ ప్రాంతాల్లో మరింత అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు.

**తెలంగాణ ప్రభుత్వం**
**రెవెన్యూ (LA) శాఖ ప్రాథమిక నోటిఫికేషన్**
**కలెక్టరేట్:: మహబూబ్‌నగర్**
**ఫారం-VI**
(నియమం-19 యొక్క ఉప-నియమం (1) మరియు చట్టం-30/2013 యొక్క సెక్షన్-11(1) చూడండి)

నం. రెవిన్యూ/జి1/ఎల్ఏజి/0009/2026-జి-సెక్షన్ తేదీ: 17.03.2026

మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద MR1 కాలువ యొక్క డిస్ట్రిబ్యూటరీ 46 తవ్వకం కొరకు, మహబూబ్ నగర్ జిల్లా, మిడ్జిల్ మండలం, చిల్వేరు గ్రామంలో మొత్తం 1.28 ఎకరాల భూమి ప్రజా ప్రయోజనం కోసం అవసరమని తెలంగాణ ప్రభుత్వానికి / జిల్లా కలెక్టర్‌కు తోచింది. ప్రభుత్వం జి.ఓ.ఎం.ఎస్.నెం.51, నీటిపారుదల & CAD (LA R&R/A2) శాఖ, తేది 25.07.2017 ద్వారా, 2013 నాటి భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టంలోని అధ్యాయం - II & III యొక్క నిబంధనల వర్తింపు నుండి మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకాన్ని మినహాయించింది. అందువల్ల, సదరు చట్టంలోని సెక్షన్ 4 (1) ప్రకారం అవసరమైన సామాజిక ప్రభావ అంచనా అధ్యయనం నిర్వహించబడలేదు. ఈ భూసేకరణ కారణంగా ఏ కుటుంబాలూ స్థానభ్రంశం చెందే అవకాశం లేదు. బాధిత కుటుంబాల పునరావాసం మరియు పునఃస్థాపన ప్రయోజనం కోసం అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ప్రాజెక్ట్ నిర్వాహకుడిగా నియమించబడ్డారు.

గ్రామము: చిల్వేరు మండలం: మిడ్జిల్ జిల్లా: మహబూబ్‌నగర్

| క్రమ సంఖ్య | సర్వే సంఖ్య | మెట్ట / మాగాణి /తడి భూమి | భూమి రకం | సముపార్జన కోసం ప్రతిపాదించబడిన విస్తీర్ణం (ఎకరాలలో) | ఆసక్తిగల వ్యక్తి పేరు మరియు చిరునామా | పరిధులు N | S | E | W | చెట్లు | నిర్మాణాలు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 |
| 1 | 78 | మెట్ట | పట్టా | 0.07 | ప్రవీణ్ రెడ్డి s/o తిరుపతి రెడ్డి | - | - | - | - | - | - |
| 2 | 78 | మెట్ట | పట్టా | 0.07 | నవీన్ రెడ్డి s/o తిరుపతి రెడ్డి | - | - | - | - | - | - |
| 3 | 77 | మెట్ట | పట్టా | 0.18 | పట్వారి హనుమంతు రెడ్డి s/o పెద్ద జంగి (రికార్డు లేదు) | - | - | - | - | - | - |
| 4 | 77 | మెట్ట | పట్టా | 0.18 | ప్రవీణ్ రెడ్డి s/o తిరుపతి రెడ్డి | - | - | - | - | - | - |
| 5 | 77 | మెట్ట | పట్టా | 0.18 | నవీన్ రెడ్డి s/o తిరుపతి రెడ్డి | - | - | - | - | - | - |
| | మొత్తం | | | 1.28 | | | | | | | |

ఈ నోటిఫికేషన్, భూసేకరణ, పునరావాసం మరియు పునఃస్థాపనలో న్యాయమైన పరిహారం మరియు పారదర్శకత హక్కు చట్టం 2013 (చట్టం నెం.30 ఆఫ్ 2013) యొక్క సెక్షన్ 11 (1) నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులందరికీ జారీ చేయబడింది.భూమి యొక్క ప్లాన్‌ను మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ మరియు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ఏ ఆర్&ఆర్, యూనిట్ II, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ కార్యాలయంలో ఏదేని పనిదినం నాడు పనివేళల్లో పరిశీలించవచ్చు. మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ / కలెక్టర్ - కమ్ -సదరు చట్టంలోని సెక్షన్ (12)లో అందించిన మరియు నిర్దేశించిన విధంగా, వారి పనిని సక్రమంగా నిర్వహించడానికి అవసరమైన అన్ని ఇతర చర్యలను చేపట్టడానికి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ LA R&R, యూనిట్-II, ఇరిగేషన్ ప్రాజెక్ట్, మహబూబ్‌నగర్ మరియు అతని సిబ్బందికి భూమిలోకి ప్రవేశించి సర్వే చేయడానికి, ఏదైనా భూమి యొక్క లెవెల్స్ తీసుకోవడానికి, ఉపరితలం క్రింద తవ్వడానికి లేదా బోరు వేయడానికి తగిన ప్రభుత్వం అధికారం ఇస్తోంది. చట్టంలోని సెక్షన్ 11(4) ప్రకారం, కలెక్టర్ యొక్క ముందస్తు అనుమతి లేకుండా, అటువంటి నోటిఫికేషన్ ప్రచురించబడిన తేదీ నుండి ఏ వ్యక్తి కూడా భూమికి సంబంధించిన ఏ లావాదేవీలు అంటే అమ్మకం/కొనుగోలు మొదలైనవి చేయకూడదు లేదా చేయించకూడదు, లేదా అటువంటి భూమిపై ఎలాంటి భారాలను సృష్టించకూడదు. చట్టంలోని సెక్షన్ (15) ప్రకారం ఈ నోటిఫికేషన్ ప్రచురణ తేదీ నుండి 60 (అరవై రోజులు) లోపు, ఆసక్తిగల వ్యక్తి భూసేకరణకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ ముందు దాఖలు చేయవచ్చు.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్, భూసేకరణ, పునరావాస విభాగం - II, సాగునీటి ప్రాజెక్టులు, మహబూబ్‌నగర్
సం/- అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మహబూబ్ నగర్
సం/- జిల్లా కలెక్టర్ మహబూబ్ నగర్

DIPR RO.No.15/LA/PP/Publication/2026-2027

# ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్

### 12 వందల కోట్ల విలువైన 8 ఎకరాలు స్వాధీనం

**హైదరాబాద్, ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఐటీ కారిడార్ లో హైడ్రా భారీ ఆపరేషన్ నిర్వహించింది . మంగళవారం ఖానామెట్ లో రూ. 12 వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చెర నుంచి కాపాడింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..ఐటీ కారిడార్ కు చేరువలోని ఖానామెట్ లో 8 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమిలో ఆక్రమణలు తొలగించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేత చేపట్టారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమి విలువ సుమారు రూ. 12 వందల కోట్లు ఉంటుందని అంచనా వేస్తున్నారు అధికారులు. ఖానామెట్ లోని సర్వే నంబర్ 55లో ఉన్న ప్రభుత్వ భూమిలో భారీ ఆపరేషన్ చేపట్టారు హైడ్రా అధికారులు. ఈ స్థలంలో తాత్కాలిక షెడ్లు, నిర్మాణాలు తొలగించారు హైడ్రా అధికారులు. హైడ్రా వార్నింగ్ తో ఆర్‌సీసీ ప్లాంట్‌ను స్వయంగా తొలగించింది ప్రభుత్వ భూమిని ఆక్రమించిన నిర్మాణ సంస్థ. ప్రభుత్వ భూమిలో కార్మికుల కోసం ఏర్పాటు చేసిన షెడ్లను తొలగించిన హైడ్రా.. మొత్తం భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ భూమిగా బోర్డులు ఏర్పాటు చేసి..అసైన్డ్ ల్యాండ్‌గా గుర్తించి, ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో నమోదు చేసినట్లు తెలిపారు అధికారులు. రియల్ ఎస్టేట్ సంస్థల తప్పుడు ÷-లకెయిమ్‌లపై చర్యలు తీసుకుంటామని తెలిపారు అధికారులు.

**IN THE COURT OF THE HON'BLE I ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-V ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, MEDCHAL-MALKAJIGIRI DISTRICT, UPPAL AT MEDIPALLY**
**O.S.NO. 111 OF 2026**

Between:
Smt. Saggu Lakhmi & another ......... Plaintiffs
AND
The Tahsildar,
Ghatkesar Revenue Mandal,
Medchal-Malkajgiri District
At Ghatkesar & another ....... Defendants
To
All Concerned .......... Defendant No.2

**NOTICE**

That the above named Plaintiff filed the above suit for declaration to declare them as legal heirs of deceased Saggu Narsimha, who died intestate, on 18-06-2021 at H.No.2-83, Yemmampet village, Pocharam Municipality, Medchal-Malkajgiri District due to ill health by leaving the Plaintiffs his legal heirs and successors to succeed his estate against you and another before the Hon'ble I Addl. Junior Civil Judge-cum-V Addl. Judicial Magistrate of First Class, Medchal-Malkajgiri District at Medipally and the above suit is posted on 20-04-2026 for objections. If any person/s he/she/they are having any objections he/she/they may appear before the above Hon'ble Court on 20-04-2026 at 10.30 A.M. either in person or through an Advocate, failing which the matter will be decided as Exparte in your absence.

(BY ORDER OF THE COURT)

**G. MAHATHMA**
**Advocate**
**Hayathnagar,**
**Ranga Reddy District**
**Counsel for the Plaintiffs**
**Phone No.9000139467**

**IN THE COURT OF THE HON`BLE X JUNIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABD**
**O.S: NO. 860 OF 2026**

BETWEEN
1.Challa Ramaiah,S/o.Late Challa Venkataiah
2.Challa Sai Aravind,S/o.Challa Ramaiah
3.Challa Lakshmi Satwik,S/o.Challa Ramaiah
All are R/o.1-8-4/9/B,Chikkadpally,
Himayathnagar Mandal,Hyderabad. ...Plaintiffs
AND
The Thasildar of Hiamayathnagar
Mandal,Hyderabad.
All Concerned

To,
All concerned
Please take Notice that the above Plaintiff has filed a suit to declare them as SOLE LEGAL HEIRS and successors of deceased late Challa Prameela Wife of Plaintiff No.1 and Mother of Plaintiff no.2 and 3,who died on 26-11-2025, the said O S is posted to 27-4-2026 at 10:30 am for your appearance in the above Hon`ble Court in person or Through duly authorized pleader otherwise the case may be heard and decided on merits .

**//By Order of Court//**
**M/s.R.SAIDHI REDDY, Advocate**
**# 6-45,Road No.4,Bhavani Nagar,Dilsukhnagar,Hyderabad.**

**BEFORE THE MOTOR VEHICLE ACCIDENTS CLAIMS TRIBUNAL CUM XII ADDL CHIEF JUDGE AT: SECUNDERABAD**
**MV.OP.NO. 783 of 2024**

Between
Satla Vinay ...Petitioners
**AND**
R.Srinivasa Rao & another ...Respondents
To,
A.Mahesh
S/o Ramaiah, Age-41 years, Occ-Accused driver, R/o 29-28, Angadi bazar, Kalyanikani, Mandamarry, Mancherial, Telangana.504231.

Take notice that the petitioner has filed a petition against the respondents' U/S 166 of M.V.Act . You are hereby required to appear before this Hon'ble XII Addl Chief Judge , Secundrabad Court on 05-05-2026 at 10:30 AM, in person or through an Advocate duly instructed to answer all material questions relating to the above proceedings, in default the issue will be heard and determined in your absence.

**// By order of the Court //**
**SUDARSHANREDDY SUBBAGARI**
**ADVOCATE**
**Counsel for petitioner**
Plot# 58 Saptagiri colony,
Neredment X Road, Secundrabad-94

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# రాజకీయం కోసం అభివృద్ధికి మోకాలడ్డరాదు!

రాజకీయాలు వేరు..అభివృద్ధి వేరు. ఈ రెంటిని కలగలిపి చూస్తే..అభివృద్ధి వెనక్కి పోతుంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన విషయంలో ఇదే జరుగుతోంది. ఎపిలో అమరావతి విషయంలనూ ఇదే కనిపిస్తోంది. తెలంగాణలో మూసీ ప్రక్షాళన చేస్తామని సిఎం రేవంత్ రెడ్డి పట్టుదలతో ఉన్నారు. ఇప్పుడు చూపిన నమూనా ప్రకారం ముందుకు వెళితే మంచిదే. అదేవిధంగా నిర్వాసితులకు ఉత్తమ ప్యాకేజీ, వారు ఆనందపడిపోయేలా ఉండాలి. ఇల్లుకు ఇల్లు, జాగాకు జగా అందాలి. మూసీని ప్రక్షాళన చేయడంలో ఎవ్వరికీ అభ్యంతరం ఉండదు. అలాగే మురుగనీటిని ఎలా, ఎక్కడికి తరలిస్తారన్నది కూడా పెద్ద సమస్య. హైదరాబాద్ మురుగునీటిని ఇంతకాలం మూసీలో పారబోస్తున్నారు. దానికి ప్రత్యామ్నాయం చూపాలి. ఇకపోతేమూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్న బిఆర్ఎస్, బిజెపిలు ప్రత్యామ్నాయాలు చూపడం లేదు. ఇలా చేద్దామని సలహాలు ఇవ్వడం లేదు. ఎందుకంటే ఇది రాజకీయం. రాజకీయాన్ని అభివృద్ధితో ముడిపెట్టడం వల్లనే మూసీ ప్రక్షాళనను ఈ రెండు పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. పదేళ్లు పాలించిన బిఆర్ఎస్ తెలంగాణ అడుక్తికునేలా చేసింది. ఇలాంటి రాజకీయాల వల్లనే తెలంగాణ మరింత వెనకబాటుకు గురవుతుంది. ఇకపోతే అమరావతి విషయంలో జగన్, ఆయన అనుచరగణం చేస్తున్న విమర్శలు, రాజకీయాలు చూస్తుంటే..ఇలాంటి నాయకులు ఉన్నందుకు సిగ్గుపడాలి. అమరావతి రాజధాని నిర్మాణం అవసరం. కానీ అసలు రాజధానే అవసరం లేదంటున్న వారు రాజకీయాల్లో ఉండడానికి లేదు. 2019 ఎన్నికల్లో 151 సీట్ల భారీ మెజారిటీని జగన్ మోహన్ రెడ్డికి కట్టబెడితే చేసిందేమిటి. ఆనాడు మావిగన్ ఆలోచన ఎందుకు రాలేదు. ఆనాడు మడు రాజధానులంటూ ఎందుకు ఊరేగారు. రాజధాని అవసరం లేదన్న వారు ఐదేళ్లు కాలయాపన చేశారు. అప్పటి నుంచి జగన్ రాజకీయ నిజస్వరూపం వెల్లడవుతూ వచ్చింది. ప్రజలకు ఆయన ఏమిటో బోధ పడింది. కక్షలు, కార్పణ్యాలు, అసూయా ద్వేషాలతో ఐదేళ్లపాటు సాగించిన పాలనతో ప్రజలకు చైతన్యం వచ్చి ఉండాలి. ఎందుకంటే ఇలాంటి నేతను మోసినందుకు సిగ్గుపడాలి. రాజకీయాల్లో వైఫల్యాలను గుణపాఠాలుగా మలచుకొని ముందుకు సాగాలి. కానీ ఇక్కడ బిఆర్ఎస్, అక్కడ జగన్ పార్టీకి ఇవేవీ కానరావడం లేదు. ఇప్పటికీ ఈ రెండు పార్టీల నేతలకు జ్ఞానోదయం కావడం లేదు. వారికి కావలసిం దల్లా అధికార పీటం తప్ప, అభివృద్ధి కాదు. భజనపరులు చుట్టూ ఉంటే అధికారంలో ఉన్నప్పుడు ప్రజా వ్యతిరేకత కనిపించదు. ప్రజలకు డబ్బు పంచితే గంపగుత్తగా ఓట్లు పడతాయని లెక్కలు వేసుకున్న నేటి విపక్ష నేతలు ఆనాడు మళ్లీ తమదే అధికారం అని ఢంకా బజాయించారు. అందుకే అధికారంలో ఉన్నప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకుని పాలన చేయాలి. ఇప్పుడు రేవంత్ రెడ్డి అయినా అదే చేయాలి. ఎందుకంటే భూకబ్జాలపై వస్తున్న ఆరోపణలపై మేల్కోవాలి. వెంటనే ఖండించాలి. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన తనయుడిపై విపరీతమైనా ఆరోపణలు ఉన్నాయి. వీటిని ఖండించకపోవడంతో అనుమానాలు మరింతగా బలపడుతున్నాయి. రేవంత్ ఇలాంటి విషయాలపై ఖచ్చితంగా లేకుంటే వచ్చే ఎన్నికల్లో ఆయన కూడా మూసీలో కొట్టుకు పోవడం ఖాయం. నిర్మాణాత్మక పనులు ఇంకా రేవంత్ మొదలు పెట్ట లేదు. ఎంతసేపు రేషన్ కార్డులు, సన్నబియ్యం, చీరలు, ఫ్రీ బస్సు వంటివే కనిపిస్తున్నాయి. ఇవేవీ అభివృద్ధి కాదని గుర్తించాలి. ఇకపోతే ఆనాడు వైనాట్ 175 అన్న జగన్ ఇప్పుడు మళ్లీ మనదే అధికారం అంటున్నారు. తెలంగాణలో కెటిఆర్ కూడా అదే మాట్లాడుతున్నారు. ఎపిలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికావస్తోంది. ఇంకేముందీ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, ఇక ఉన్నది రెండేళ్ల కాలమని, చివరి సంవత్సరం అంతా ఎన్నికలకే పోతుందని, తన పాదయాత్ర కూడా ఉంటుందని జగన్ నమ్మబలుతుకున్నారు. అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాలను ప్రజలు మరచిపోరని ఏ పార్టీ అయినా గుర్తించాలి. అధజకారంలో ఉన్నప్పుడు జగన్‌కు మావిగన్ ఆలోచన రాలేదు. అంటే అమరావతి మీద ద్వేషంతో చేస్తున్నదే అని వేరుగా చెప్పాల్సిన పనిలేదు. మహా నగరాలతో 'మావిగన్' పోటీ పడుతుందని ప్రచారం కూడా మొదలెట్టారు. రాజ్యాంగంలో రాష్ట్రాలకు రాజధాని అనే పదం లేదని జగన్ చెప్పడం చూస్తుంటే, ఇలాంటి వ్యక్తిని ఎందుకు ఆదరించాలో ప్రజలు కూడా ఆలోచించాలి. హైదరాబాద్ మహా నగరం నుంచి వస్తున్న ఆదాయంతోనే తెలంగాణ నడుస్తోంది. ఇప్పుడు రేవంత్ ఫ్యూచర్ సిటీ అంటున్నారు. ఇది సాధ్యామా అన్నది కూడా ఆలోచించాలి. నగరాలు వాటంతటే అవే రావాలి తప్ప, చేస్తే రావు. అరావతి వేరు...ఫ్యూచర్ సిటీ వేరు అని గుర్తించాలి. ఆంధ్రప్రదేశ్‌కు ప్రస్తుతం విశాఖపట్నం నుంచి అధికంగా ఆదాయం వస్తోంది. అమరావతి మహా నగరంగా అభివృద్ధి చెందితే రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. రైతులు ఇచ్చిన భూములను అభివృద్ధి చేసి, అందులో కొంత భాగాన్ని విక్రయించి ఆ డబ్బుతో మౌలిక వసతులు కల్పించబోతున్నారు. హైదరాబాద్ ఇప్పటి రూపం సంతరించుకోవడానికి మూడు దశాబ్దాలకు పైగా పట్టింది. అభివృద్ధి అనేది నిరంతర పక్రియ. సంకుచితంగా ఆలోచించేవారు అభివృద్ధి గురించి ఆలోచించలేరు. అందుకే రాజకీయాలు వేరు. అభివృద్ధి వేరు. రాజకీయ పార్టీల నేతలకు దూరదృష్టి ఉండాలి. అభివృద్ధిపై అవగాహన ఉండాలి. వందేళ్ల ముందు గురించి ఆలోచించాలి. అంతేగాని రాజకీయాలతో వెనకేసుకుని బతుకుదామనుకునే వారు పాలకులు కాబోరు.

# సిఎస్‌కెకు ఏమయ్యింది?

## నాయకత్వ సమస్యతో సతమతం... వరుసగా మూడు మ్యాచ్‌లు ఓటమిపై ఆందోళన




**చెన్నై,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ):** ఐపిఎల్ మ్యాచ్‌లో అతి పేలవ ప్రదర్శనలో చెన్నై సూపర్‌కింగ్ సిఎస్‌కే ముందున్నది. నాయకత్వ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. ధోనీ అందులో ఉన్నంత సేపు ఊపులో ఉన్న సిఎస్‌కె ఇప్పుడు అత్యంత పేలవ ప్రదర్శన ఇస్తోంది. సొంత మైదానం చిదంబరం స్టేడియంలో ఐపిఎల్ మ్యాచ్ అంటే.. పసుపు జెర్సీలతో కళకళలాడుతుంది. అలాంటి చెన్నై సూపర్‌కింగ్స్ ఈ సీజన్‌లో ఆడి 3మ్యాచుల్లోనూ ఘోర పరాజయాలను చవిచూసింది. ఈ ఓటములు కెప్టెన్సీ లోపం కారణంగా వస్తున్నాయా..? ఫినిషింగ్ కింగ్ మహేంద్రసింగ్ ధోనీ, బ్రెవీస్ జట్టుకు అందుబాటులో లేకపోవడమో.. ఇలా జరుగుతున్నాయా.. అనేది సగటు ప్రతి చెన్నై అభిమానిని కలచివేస్తోంది. ధోనీ కెప్టెన్సీ త్యాగం చేసిన తర్వాత రుతురాజ్ గైక్వాడ్ సారథ్యంలో ఆ జట్టు ఆడిన 22మ్యాచుల్లో ఏకంగా 14 మ్యాచుల్లో ఓటమిపాలైంది. ఒకప్పుడు చెన్నై సూపర్‌తో మ్యాచ్ అంటే ప్రత్యర్థి జట్లకు వణుకు పుట్టేది. అంతటి గొప్ప రికార్డు చెన్నై సూపర్‌కింగ్స్ సొంతం. ఆ జట్టు అత్యధికంగా ఐదుసార్లు ఐపిఎల్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. 2010, 2011, 2018, 2021, 2023లలో ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై.. ఆ తర్వాత సీజన్ 2024లో ఆడిన 14మ్యాచుల్లో 7మ్యాచుల్లో మాత్రమే గెలిచింది. ఇక 2025 సీజన్‌లో అయితే.. 14మ్యాచుల్లో 4మ్యాచుల్లో గెలిచి చిట్టచివరి స్థానంలో నిలిచింది. ఇక 2026సీజన్‌లో ఆడిన 3మ్యాచుల్లోనూ చిత్తుగా ఓడింది. గౌహతి వేదికగా రాజస్తాన్ రాయల్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో 8వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగి కేవలం 127పరుగులకే కుప్పకూలింది. ఆ లక్ష్యాన్ని రాజస్తాన్ జట్టు కేవలం 12.1ఓవర్లలోనే ఛేదించింది. ఇక సొంతమైదానం చిదంబరం స్టేడియంలో పంజాబ్ కింగ్స్‌పై 209 పరుగుల భారీస్కోర్‌ను కొట్టింది. ఆ లక్ష్యాన్ని పంజాబ్ జట్టు మరో 8బంతులు మిగిలి ఉండగానే ఛేదించి 5వికెట్ల తేడాతో విజయం సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ)తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బౌలింగ్ ఎంచుకొన్న గైక్వాడ్ నిర్ణయాన్ని బౌలర్లు సద్వినియోగం చేసుకోలేక పోయారు.. దీంతో ఆర్సీబీ 20 ఓవర్లలో 3వికెట్ల నష్టానికి 250పరుగుల భారీస్కోర్ చేసింది. ముఖ్యంగా టిమ్ డేవిడ్(70నాటౌట్; 25బంతుల్లో 3ఫోర్లు, 8సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగి చెన్నై బౌలర్లకు చుక్కలు చూపించాడు. అనంతరం చెన్నై 19.4ఓవర్లలో 207పరుగులకే కుప్పకూలింది. ఆర్సీబీ చేతిలో 43పరుగుల తేడాతో ఓడిన చెన్నై సూపర్‌కింగ్స్‌కు ఈ సీజన్‌లో వరుసగా ఇది మూడో ఓటమి. దీంతో రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి ప్రధాన కారణంగా.. గైక్వాడ్ కెప్టెన్సీలో చెన్నై ఆడిన 22 మ్యాచుల్లో 14మ్యాచుల్లో ఓటమిపాలైంది. సీజన్ తొలి మ్యాచ్‌లకు మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ, స్టార్ ఆల్‌రౌండర్ బ్రెవీస్ దూరమయ్యారు. ధోనీ గాయం కారణంగా, ఫిట్‌నెస్ కారణాలతో బ్రెవీస్ కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యారు. దీంతో కీపింగ్ బాధ్యతలను టీమిండియా టి20 స్టార్, వరల్డ్‌కప్ విజేత సంజూ శాంసన్ వికెట్ కీపర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. పవర్ హిట్టర్ డెవాల్డ్ బ్రెవిస్ కూడా ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే చెన్నై తదుపరి ఆడే మ్యాచ్‌లకు వీరిద్దరూ అందుబాటులో ఉంటారని సమాచారం. బ్రెవీస్, ధోనీ ఫిట్‌నెస్ సాధించారని వీరిద్దరూ తదుపరి మ్యాచ్‌కు చెన్నై జట్టులో ఎంట్రీకి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. మధ్య ఓవర్లలో విధ్వంసకర బ్యాటింగ్‌తో విరుచుకుపడగల సత్తా బ్రెవీస్ సొంతం. ఇక ఆర్సీబీతో మ్యాచ్‌లో ఓటమి తర్వాత సీఎస్‌కే హెడ్‌కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. 'తదుపరి మ్యాచ్‌వరకు అంతా సర్దుకుంటుందనే అనుకుంటున్నాం. తర్వాతి మ్యాచ్‌కు మాకు ఐదు రోజుల సమయం ఉంది. ఈ ఓటమి బాధించింది. అయితే, మా ప్రణాళికలకు అనుగుణంగా తదుపరి మ్యాచ్‌లో ముందడుగు వేయగలమనే నమ్మకం ఉంది' అని పేర్కొన్నాడు. చెన్నై తదుపరి మ్యాచ్ సొంత మైదానం చెపాక్ వేదికగా ఏప్రిల్ 11న ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనుంది.

# ఆరు గ్యారెంటీలు 900 రోజులైనా ఏవీ

## పరిగిలో భూములు లాక్కునే యత్నం... సిఎం రేవంత్‌పై విరుచుకుపడ్డ హరీష్ రావు

## పరిగి వెళుతున్న హరీష్ రావు తదితరుల అరెస్ట్... శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలింపు



**హైదరాబాద్, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** పరిగిలో భూముల లాక్కొని తన సోదరుడికి కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు నిప్పులు చెరిగారు. 6 గ్యారెంటీలు 100 రోజుల్లో పూర్తి చేస్తామన్నారు.. 900 రోజులైనా ఎందుకు పూర్తి చేయలేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మళ్లీ నిప్పులు చెరిగారు. మంగళవారం శంషాబాద్ పోలీస్ స్టేషన్ వద్ద హరీశ్ రావు మాట్లాడుతూ.. రేవంత్ నువ్వు మళ్ళీ గెలవడం కాదు కదా ప్రతిపక్ష హోదా కూడా నీ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తే అరెస్టులు చేస్తున్నారని చెప్పారు. పరిగిలో రైతులను పరామర్శించేందుకు వెళుంటే తమను అరెస్టు చేశారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి పాలన.. గడీల పాలన.. బేడీల పాలన.. గుడ్డి పాలన అంటూ హరీశ్ రావు అభివర్ణించారు. సాగుకు పనికిరాని భూముల్లో పరిశ్రమలు పెట్టండంటూ ప్రభుత్వానికి ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఎస్సీ, ఎస్టీ రైతులు సాగు చేసుకుంటున్నా భూములను ఎందుకు లాక్కుంటున్నారంటూ ప్రభుత్వాన్ని సూటిగా ఆయన ప్రశ్నించారు. మీ పాలన అంతా బోగస్ మాటలు.. బోగస్ పాలన అంటూ రేవంత్ పరిపాలనను ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి మించిన రావణాసురుడు ఎవరైనా ఉన్నారా? అని ఈ సందర్భంగా హరీశ్ రావు ప్రశ్నించారు. రామరాజ్యం వస్తుంది.. కేసీఆర్ రాజ్యం వస్తుందని ఈ సందర్భంగా హరీశ్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు. పరిగిలో రైతులకు మద్దతు తెలిపేందుకు వెళ్తన్న హరీశ్ రావుతో ఆయన అనుచరులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం వారిని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దాంతో హరీశ్ రావు పైవిధంగా స్పందించారు. పోలీసు నిర్బంధాలు, అణిచివేత చర్యల మధ్య వికారాబాద్ జిల్లా పరిగి రైతుల వద్దకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు బయల్దేరారు. మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర రెడ్డి, దివాకర్ రావు, మాజీ చైర్మన్ ఎర్రోళ్ల దయాకర్‌రావుతో కలిసి ఆయన పరిగికి బయల్దేరారు. ఈ క్రమంలో మార్గమధ్యలో అప్పా జంక్షన్ వద్ద వారిని పోలీసులు అడ్డుకున్నారు. పరిగికి చేరుకోకుండా హరీశ్‌రావును పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్‌రావు కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా లారీలను రోడ్డుకు అడ్డంగా పెట్టారు. రైతులకు భరోసాగా వెళ్తున్న హరీశ్‌రావును అరెస్టు చేసేందుకు యత్నించారు. అయితే పోలీసుల తీరును బీఆర్ఎస్ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం నెలకొంది. బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించిన ఆందోళన చేపట్టారు. దీంతో అప్పా జంక్షన్ వద్ద ఉద్రిక్తత నెలకొంది. అప్పా జంక్షన్ వద్ద అడ్డుకుని శంషాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆయనతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావును స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పాలన రాక్షస పాలనగా మారిందని విమర్శించారు. పరిగిలో అన్యాయానికి గురైన రైతులకు భరోసా ఇవ్వడానికి వెళ్తున్న మమ్మల్ని అడ్డుకొని, అన్యాయంగా అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడికక్కడ దళిత, గిరిజన, బలహీనుల భూములు లాక్కుంటున్నారని అన్నారు. రాష్ట్రంలో పోలీసుల రాజ్యం నడుస్తుందని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను పలకరించడానికి కూడా వెళ్లనివ్వడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

# వలస కార్మికులకు కేంద్రం శుభవార్త

## ఇక నుంచి 5 కెజీల రెండు సిలిండర్ల సరఫరా రాష్ట్రాలకు సూచించిన కేంద్రం

**న్యూఢిల్లీ,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ):** వలస కార్మికులకు కేంద్రం ఊరట కలిగించింది. వారికి గ్యాస్ సరఫరాపై పెట్రోలియం మంత్రిత్వ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. వలస కార్మికులకు 5 కేజీల ఎఫ్‌టీఎల్ గ్యాస్ సిలిండర్ల సరఫరా రెట్టింపు చేయాలని రాష్ట్రాలను కేంద్రం కోరింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. ఎల్‌పిజి గ్యాస్ కొరత వల్ల దేశంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వలస కార్మికుల సంగతి సరేసరి. ఈ నేపథ్యంలో వలస కార్మికులని దృష్టిలో ఉంచుకుని రోజుకి 5 కేజల గ్యాస్ సిలిండర్ అడ్రస్ ప్రూఫ్ లేకుండా.. ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు చూపించి కొనుగోలు చేయవచ్చని ఇటీవల కేంద్రం ప్రకటించింది. ఐదు కేజీల గ్యాస్ సిలిండర్ సమీపంలో ఎల్‌పిజి డిస్టిబ్యూటర్ల దగ్గర అందుబాటులో ఉంటుందని పెట్రోలియం శాఖ తెలిపింది. తాజాగా మంగళవారం వలసకార్మికులకు ఇచ్చే గ్యాస్ సిలిండర్ల సంఖ్యను కేంద్రం డబుల్‌కి పెంచింది. అంటే వలస కార్మికులు రోజుకి రెండు ఐదు కేజీల ఎల్‌పిజి సిలిండర్లను కొనుగోలు చేసేందుకు మంత్రిత్వశాఖ వీలు కల్పించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు మంత్రిత్వశాఖ లేఖ రాసింది. మార్చి 21వ తేదీన రాష్ట్రాల చీఫ్‌లకు రాసిన లేఖలో వలస కార్మికులకు ఐదు కేజీ సిలిండర్‌లను ఓఎంసి (ఆయిల్ మార్కెటింగ్ కంపెనీనీ)ల సహాయంతో ఇవ్వాలని లేఖ రాసింది. అయితే ఈ లేఖలో రాసిన దానికంటే 20 శాతం పరిమితికి మించి పెంచడం జరిగిందని, వలస కార్మికులకు సిలిండర్లను అందుబాటులో ఉంచాలని పెట్రోలియం శాఖ తాజాగా రాష్ట్రాలకు రాసిన లేఖలో పేర్కొంది.

# అన్నమయ్య జిల్లాలో విషాద ఘటన

## యువన్యాయవాది దారుణ హత్య

**అన్నమయ్య,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ):** అన్నమయ్య జిల్లా, పీలేరు నియోజకవర్గం పరిధిలోని కె.వి.పల్లి మండలంలో ఓ న్యాయవాది దారుణహత్యకు గురయ్యాడు. సోమవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో న్యాయవాది తల్లిదండ్రులు కూడా గాయపడ్డారు. మంగళవారం న్యాయవాది తరపు కుటుంబ సభ్యుల కథనం మేరకు . వివరాలు ఇలా ఉన్నాయి. పీలేరు న్యాయస్థానంలో న్యాయవాదిగా పనిచేస్తున్న పూజారి ఎల్లయ్య (35) కె.వి పల్లి మండలం, తీతవగుంటపల్లి గ్రామ పంచాయతి, పాతవడ్డిపల్లిలో నివాసం ఉంటున్నారు. గుర్తుతెలియని దుండగులు సుమారు పదిమందికి పైగా న్యాయవాది ఇంటికి వచ్చి, తలుపులు పగలగొట్టి, లోనికి చొరబడ్డారు. ఆ శబ్దానికి నిద్ర మేల్కొన్న ఎల్లయ్య పై వారు రాళ్ళతో దాడి చేసి హతమార్చారు. అడ్డొచ్చిన అతని తల్లిదండ్రులు పూజారి వెంకటరమణ, రెడ్డమ్మలను కూడా గాయపరిచారు. గాయపడినవారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారని తెలిసింది. ఈ దాడికి పాత కక్షలే కారణం అయ్యుంటాయని గ్రామస్తులు కొందరు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు గ్రామంలో ఒకచోట ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను మరో చోటికి మార్చడంలో ఆ న్యాయవాది ప్రమేయం ఉందన్న అనుమానం కూడా కారణం అయ్యుండవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రాత్రి సమయంలో జరిగిన ఈ దాడితో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమాచారం అందుకున్న కె.వి.పల్లి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, అక్కడి పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. న్యాయవాది హత్యకు పాల్పడిన వ్యక్తులెవరు, దాడి వెనుక ఉన్న అసలు కారణాలు ఏమిటన్న దానిపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. రాత్రి వేళలో చోటు చేసుకున్న ఈ హత్యా సంఘటన గ్రామ ప్రజలను భయాందోళనకు గురిచేసింది.

# ఆంధ్రజ్యోతిపై దాడి దుర్మార్గం

## తీవ్రంగా ఖండించిన మీడియా సంఘాలు

**అమరావతి,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ):** హైదరాబాద్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నాయకులు దాడికి ప్రయత్నించడంపై మీడియా సంఘాలు స్పందించాయి. ఈ దాడిని ఐకేయూ, ఏపీయూడబ్ల్యూజే, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్, ఆర్ఎన్ఎ న్యూఏజెన్సీలు తీవ్రంగా ఖండించాయి. ఒక మీడియా సంస్థను నిర్వహిస్తున్న వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇలాంటి చర్యలకు సొంత పార్టీలోని వారిని ఉసిగొల్పటం మీడియా స్వేచ్ఛపై దాడిగా భావించక తప్పదని జర్నలిస్టు సంఘాల నేతలు డి.సోమసుందర్, ఐ.వి.సుబ్బారావు, ఏచూరి శివ (ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్), ఆర్ఎన్ఎ చీఫ్ ఎడిటర్ అవ్వారు రఘు స్పష్టం చేశారు. ఏపీ రాజధానిగా మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ కొత్త రాజధానిని ఏర్పాటు చేయాలని.. దానికి మావిగన్ అనే పేరు పెట్టాలని వైసీపీ అధినేత వైఎస్ జగన్ ప్రతిపాదించారు. అది కూడా రాజధాని అమరావతి బిల్లు పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందే క్రమంలో వైఎస్ జగన్ ఈ ప్రతిపాదన చేయడం విమర్శలకు తావిచ్చింది. నేపథ్యంలో ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ తన కొత్త పలుకులో ప్రత్యేక కథనాన్ని రాశారు. దీనిపై వైసీపీ శ్రేణులు పెద్ద ఎత్తున మండిపడ్డాయి. అంతేకాకుండా రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాలతో ఆ పార్టీలోని కీలక నేతలు వరుసగా ప్రెస్ మీట్లు పెట్టి.. స్పందించారు. అందులోభాగంగా మంగళవారం హైదరాబాద్ ఫిలింనగర్‌లోని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం వద్ద వైసీపీ శ్రేణులు ఆందోళన చేపట్టాయి.

# అజాగ్రత్తగా డ్రైవ్ చేయవద్దు

## ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు.. రోడ్ సేఫ్టీపై డిజిపి శివధర్ రెడ్డి

**ములుగు,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ):** అజాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని, రోడ్ సేఫ్టీ అన్నిటికన్నా ముఖ్యమని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి హెచ్చరించారు. సురక్షిత డ్రైవింగే అన్ని విధాలుగా మేలని పేర్కొన్నారు. మంగళవారం వెంకటాపురం మండల కేంద్రంలో అరైవ్ అలైవ్ కార్యక్రమానికి డీజీపీ శివధర్ రెడ్డి, ఎస్ఐబీ చీఫ్ సుమతి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి భద్రత రూల్స్ పాటిస్తామని ప్రమాణం చేయించారు. అనంతరం డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడపొద్దని వాహనదారులకు సూచించారు. కారు బెల్ట్ పెట్టుకోకుండా డ్రైవింగ్ చేయొద్దని అన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రాణం మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. హెల్మెట్ లేకపోవడం వల్లే 75 శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని.. 18 ఏళ్ల నుంచి 40 సంవత్సరాల వారే ఈ ప్రమాదాల బారిన పడుతున్నారని డీజీపీ శివధర్ రెడ్డి పేర్కొన్నారు. అంతకుముందు ములుగు జిల్లాలోని వెంకటాపురం మండలం పాముసూరు అటవీ ప్రాంతంలో పోలీస్ ఔట్ పోస్ట్, ఇంటలిజెన్స్ కో ఆర్డినేషన్ సెంటర్‌ను డీజీపీ శివధర్ రెడ్డి, ఐబీ చీఫ్ సుమతి, ప్రిన్సిపాల్ చీఫ్ ఫారెస్ట్ కన్జర్వేటర్ సువర్ణ, సీఆర్పీఎఫ్ అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ శివధర్ రెడ్డి మాట్లాడారు. కర్రెగుట్టల్లో రోడ్లు వేయడం శుభపరిణామమని పేర్కొన్నారు. అభివృద్ధి జరగాలంటే రోడ్ల నిర్మాణం జరగాలని చెప్పుకొచ్చారు. కొన్ని కారణాల వల్ల ఇక్కడ అభివృద్ధి నిలిచిపోయిందన్నారు.

# కోమాలో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ

## కోడై కూస్తున్న అంతర్జాతీయ మీడియా



**టెహ్రాన్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ):** ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ చాలా రోజుల నుంచి కోమాలో ఉన్నారన్న వార్త ఇప్పుడు ప్రపంచమంతా దావానలంలా వ్యాపిస్తోంది. ప్రస్తుతం ఖోమ్ నగరంలో చికిత్స పొందుతున్నారని కోడై కూస్తోంది. ఇరాన్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలలో మొజ్తాబా ప్రమేయం ఏమీ లేదని అంతర్జాతీయ మీడియా అంటోంది. మొజ్తాబా ప్రస్తుతం అపస్మారక స్థితిలో ఉన్నట్టు అమెరికా- ఇజ్రాయెల్ దేశాల నిఘా సంస్థలకు తెలుసని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. మొజ్తాబా తీవ్ర అనారోగ్యంతో ఉన్నందువల్ల నిర్ణయాలు తీసుకోలేని స్థితిలో ఉన్నారని తెలిపింది అమెరికా-ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతొల్లా అలీ ఖమేనీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీంతో ఆయన కుమారడు మొజ్తాబా ఖమేనీని తదుపరి సుప్రీం లీడర్‌గా ఎన్నుకున్నారు. సుప్రీం లీడర్ అయిన తర్వాత కూడా మొజ్తాబా ఎక్కడా కనిపించలేదు.

మొజ్తాబా తీవ్రంగా గాయపడ్డారని, ప్రాణాలు కూడా కోల్పోయి ఉండొచ్చని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అప్పట్లో అన్నారు. ఖమేనీని చికిత్స నిమిత్తం రష్యాలోని మాస్కోకు తరలించారని కూడా వార్తలు వచ్చాయి. ÷రిజ్తాబా ఖమేనీ ఇరాన్‌లోనే ఉన్నారని, బయటకు వెల్లడించలేని కారణాల వల్ల ఆయన బహిరంగంగా కనిపించడం లేదని రష్యా రాయబారి తెలిపారు . కాగా, మోజ్తాబా ఖమేనీ ఆరోగ్యంపై వచ్చిన ఈ వార్తలు ఇరాన్ రాజకీయాల్లో కీలక మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. అయితే ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం లేదా అధికార వర్గాలు ఈ వార్తను అధికారికంగా ధ్రువీకరించలేదు. అందువల్ల ఇప్పటికి ఇవి కేవలం నివేదికల ఆధారంగా వచ్చిన సమాచారం మాత్రమే.

# ఆధ్యాత్మికం




శివకేశవులకు ప్రీతికరమైన మాసంగా కార్తీక మాసాన్ని జరుపుకుంటారు. ఈ కార్తీక మాసంలో ఏకాదశి, ద్వాదశి, పౌర్ణిమ, సోమవారాలలో శివకేశవులకు ప్రత్యేకమైన పూజలను నిర్వహిస్తారు. ఈ రోజులలో శివారాధన చేయడం ద్వారా ఆ పరమశివుని అనుగ్రహం కలిగి అష్ట ఐశ్వర్యాలు కలుగుతాయని ప్రగాఢ విశ్వాసం. ఎంతో పవిత్రమైన ఏకాదశి, ద్వాదశి తిథుల్లో మనం ఏం చేయాలో ఎలా పూజలను నిర్వహించాలో ఇక్కడ తెలుసుకుందాం.... కార్తీక మాసంలో వచ్చే ఏకాదశి, ద్వాదశి తిథుల్లో ఈ రెండు రోజులు విష్ణు సంబంధించినటువంటి పూజలను నిర్వహిస్తారు. అంతే కాకుండా కార్తీకమాసంలో వచ్చే శుక్లపక్ష ఏకాదశిని ప్రబోధ ఏకాదశి అని కూడా పిలుస్తారు. ఈ ఏకాదశి స్వామి వారికి ఎంతో ప్రీతికరమైనది ఆషాఢ మాసంలో వచ్చే ఏకాదశి రోజు శయన పై నిద్రించిన విష్ణు భగవానుడు ఈ ఏకాదశి రోజున నిద్రలేవడం వల్ల ఈరోజు ఎంతో భక్తి శ్రద్ధలతో స్వామి వారిని పూజిస్తారు.

అదేవిధంగా కార్తీక శుద్ధ ద్వాదశి రోజును క్షీరాబ్ది ద్వాదశి అని కూడా పిలుస్తారు.

ఏకాదశి రోజున విష్ణు భగవానుడు క్షీరసాగరమధనం నుంచి బయలుదేరి వచ్చి తనకెంతో ఇష్టమైన తులసి బృందావనంలోకి ద్వాదశి నాడు ప్రవేశిస్తాడు. అందుకోసమే కార్తీక శుద్ధ ద్వాదశి రోజు తులసికోటకు ఎంతో ప్రత్యేకమైన పూజలను నిర్వహిస్తారు. కార్తీక శుద్ధ ద్వాదశి రోజున సూర్యాస్తమయ సమయంలో తులసికోట ముందు దీపాలను వెలిగించి తులసికి, విష్ణుభగవానుడుకి ప్రత్యేక పూజలు నిర్వహించి దానధర్మాలు చేయడం వల్ల అష్టైశ్వర్యాలు చేకూరుతాయని పండితులు చెబుతున్నారు. అంతే కాకుండా ఎన్నో రకాల వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చుని, కార్తీక శుద్ధ ద్వాదశి రోజున తులసి చెట్టును పూజించడం వల్ల ఈతిబాధలు తొలగిపోయి సకల సంపదలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లుతారని వేద పండితులు తెలియజేస్తున్నారు. ఈ పవిత్రమైన రోజుల్లో శివాలయాలు, విష్ణుదేవాలయాలను దర్శించుకోవడం ద్వారా అనుకున్న కార్యక్రమాలు నెరవేరుతాయి.

# మేడారం జాతర గురించి తెలుసుకోవాల్సిన 5 విషయాలు?




మేడారం జాతర సందడి మొదలైంది.. తెలంగాణలోనే కాదు.. దక్షిణ భారతంలోనే అతి పెద్ద జాతరగా దీనికి పేరు ఉంది. ఈ మేడారం సమ్మక్క- సారలమ్మ జాతర తెలంగాణ రాష్ట్రంలోని ములుగు జిల్లాలో జరుగుతుంది. తాడ్వాయి మండలంలో ఈ మేడారం ఉంది. సమ్మక్క చిన్నతనంలో పులుల మధ్య ఆడుకుందని చెబుతారు. ఆమెను గిరిజనులు గ్రామానికి తీసుకొచ్చాక ఆమె తన మహిమలు చూపిందని చెబుతారు. అయితే.. ఈ మేడారం జాతర గురించి తెలుసుకోవాల్సిన అంశాలు ఇంకా చాలా ఉన్నాయి. అందులో ప్రధానమైన పది విషయాలు తెలుసుకుందాం..

**ఒకటి.**

మేడారం జాతర దేశంలోనే ఎక్కువ మంది పాల్గొనే జాతరల్లో ఒకటి.. కుంభమేళా తరువాత దేశంలో జరిగే అతి పెద్ద జాతర మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరేనట.

**రెండు.**

మేడారంలో రెండేళ్లకోసారి జరిగే మహా గిరిజన జాతర. ఇది ఆసియాలోనే అతి పెద్ద జాతరగా గుర్తింపు పొందింది. ఈ జాతర చూసి తరించేందుకు తెలుగు రాష్ట్రాల నుంచే కాదు.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు వస్తారు. ఈసారి కోటిమంది వస్తారని అంచనా.

**మూడు.**

మేడారం జాతర గిరిజనుల జాతర.. ఇది ప్రతి రెండేళ్లకోసారి మాఘ మాసంలో నాలుగురోజులపాటు కన్నుల పండుగగా జరుగుతుంది. ఇక్కడ మొక్కులు చెల్లించుకుంటే సర్వ శుభాలూ కలుగుతాయని భక్తులు నమ్ముతారు.

**నాలుగు**

మేడారం ప్రత్యేకత ఏంటంటే.. ఇక్కడ దేవుళ్ల విగ్రహాలు ఉండవు.. కేవలం గద్దెలు మాత్రమే ఉంటాయి. ఇక్కడ శాశ్వతమైన దేవతామూర్తులు లేకపోవడం విశేషం.. ఏటా సమ్మక్క సారలమ్మలను ఈ గద్దెలపైకి తీసుకొస్తారు. ఆ తర్వాత వారిని వనప్రవేశం చేస్తారు.

**ఐదు**

ఆనాటి కాకతీయ రాజును ఎదిరించిన వన దేవతలుగా సమ్మక్క సారలమ్మలను గిరిజనులు కొలుస్తారు. అప్పటి ప్రతాప రుద్రుడు కప్పం కోసం సమ్మక్క భర్త పగిడిద్దరాజుపైకి యుద్ధానికి వచ్చాడని.. ఆ యుద్ధంలో పగిడిద్దరాజు, సమ్మక్క ఆమె కుమార్తె సారలమ్మ, అల్లుడు గోవిందరాజు మరణించారని చెబుతారు. తీవ్రంగా గాయపడిన సమ్మక్క చిలకల గుట్టపైకి వెళ్లి మాయమైందని చెబుతారు.

## నకిలీ కరెన్సీ ముఠా గుట్టు రట్టు

### ఫేక్ కరెన్సీ మారుస్తుండగా పట్టివేత

**భీమవరం,ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** పశ్చిమ గోదావరి జిల్లాలో నకిలీ కరెన్సీ ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఫేక్ కరెన్సీ మార్చుకునేందుకు వచ్చిన ముఠా పోలీసులకు అడ్డంగా బుక్కయ్యింది. నిందితుల నుంచి రూ.2 కోట్లపైగా నకిలీ నగదును స్వాధీనం చేసుకుని వారిని అరెస్టు చేశారు. పక్కా సమాచారంతో ఎ÷-లాన్ వేసి ముఠా సభ్యులకు షాక్ ఇచ్చారు పోలీసులు. ఈ ఘటన జిల్లా కేంద్రం భీమవరంలో జరిగింది.తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన కొవ్వూరి గోపిచంద్రారెడ్డి, ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన వేముల మోహనసాయి, బర్రె సుధీర్ అనే వ్యక్తులు మార్కెట్‌లో ఫేక్ కరెన్సీ సరఫరా చేస్తున్నారు. అయితే, రూ.లక్షకు రూ.3లక్షల ఫేక్ కరెన్సీ ఇస్తామని భీమవరానికి చెందిన శివశంకర్‌ను ఈ ముఠా నమ్మించింది. రూ.3 లక్షలు ఇస్తే రూ.9 లక్షలు ఇచ్చేలా మాట్లాడుకున్నారు. అయితే, ఫేక్ కరెన్సీకి బదులుగా డమ్మీ కరెన్సీని చూపించారు ముఠా సభ్యులు. అనుమానం వచ్చి పోలీసులకు శివశంకర్ సమాచారం ఇచ్చారు. పక్కా పథకం ప్రకారం నోట్లు మార్పిడి జరిగే ప్రాంతంలో పోలీసులు మాటు వేశారు. కరెన్సీ మార్చుకునే సమయంలో చాకచక్యంగా ముఠాను అరెస్టు చేశారు. గోపిచంద్రారెడ్డి, వేముల మోహనసాయిని అరెస్టు చేయగా.. బర్రె సుధీర్ పరారయ్యాడు. వారి నుంచి రూ.2.9 కోట్ల విలువగా చూపించే డమ్మీ నోట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే కారును సీజ్ చేశారు. కాగా, పారిపోయిన నిందితుడి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**కాకినాడ, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం నగరం గ్రామ శివారులో సోమవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రాయవరం గ్రామానికి చెందిన దొడ్డి అచ్యుత సాయి మనోహర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈయన ప్రయాణిస్తున్న బైక్ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అచ్యుత సాయి మనోహర్ అక్కడిక్కడే మృతి చెందగా అతడితో పాటు ఉన్న శివకు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పన్నుల ఎగవేతపై సీరియస్

### రెవన్ పోర్టల్ అభివృద్ధికి నిర్ణయం

**హైదరాబాద్ ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** పన్నుల ఎగవేతను అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. సీఎస్ నేతృత్వంలో రెవెన్యూశాఖ విభాగాల కార్యదర్శులతో అధ్యయన కమిటీని నియమించింది. ఆదాయం తెచ్చే శాఖలన్నింటినీ కలిపి 'రెవన్' పోర్టల్ అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. శాఖల మధ్య డేటా మార్పిడి, పర్యవేక్షణకు పోర్టల్ రూపకల్పనపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. స్థానిక సంస్థలు వినోదపు పన్ను వసూలు, యూపీఐ, పీవోఎస్ లావాదేవీలపై నిఘా పెట్టేలా కొత్త చట్టం ఏర్పాటు తదితర అంశాలపై అధ్యయనం చేయనుంది. 30 రోజుల్లో ప్రాథమిక, 60 రోజుల్లో సమగ్ర నివేదిక ఇవ్వనుంది.

## రైతులను పరామర్శించకుండా అడ్డుకుంటారా

### ఇంత నిరంకుశంగా వ్యవహరించడం సరికాదు

### హరీష్ రావు అరెస్టును ఖండించిన బిఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్,ఏప్రిల్7(ఆర్ఎన్ఎ):** పరిగి పర్యటనకు వెళ్లకుండా బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావును అడ్డుకోవడాన్ని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. హరీశ్‌రావు గృహ నిర్బంధం అక్రమమని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అరెస్టు అప్రజాస్వామికమని తెలిపారు. తప్పు చేయకుంటే ఈ సర్కార్‌కు భయమెందుకు అని ప్రశ్నించారు. రైతుల పక్షాన పోరాడితే అడ్డుకుంటారా నిలదీశారు. అధికారం చేతిలో ఉందని ఈ ప్రభుత్వం అక్రమంగా రైతుల భూముల చెరబడుతున్నదని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. రెండున్నరేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ వచ్చింది లేదు .. ఒక్క ఇటుక పేర్చింది లేదని విమర్శించారు. కానీ భూసేకరణ పేరుతో రైతులను భయభ్రాంతులకు గురిచేస్తుం దని మండిపడ్డారు. తమ భూముల కోసం పోరాడుతున్న రైతులకు భరోసా ఇవ్వడం ప్రతిపక్షంగా బీఆర్ఎస్ బాధ్యత అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నాయకుల అక్రమ నిర్బంధం సిగ్గు చేటు అని విమర్శించారు. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్నట్లు .. కాంగ్రెస్ నేతలు భూములను దోచుకుంటున్నారని నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. ప్రభుత్వం ఎంత అణచివేసినా ప్రజలు, రైతుల తరపున ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.

## నేచర్ క్యూర్‌లో ఈట్ రైట్ మేళా

### పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, ఏప్రిల్ 7(ఆర్ఎన్ఎ):** ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహారంపై ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేళాలో సోమవారం సాయంత్రం మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి బల్కంపేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో ఈట్ రైట్ మేళాను నిర్వహించారు. ఈట్ రైట్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలతో పలువురు ఫుడ్ వెంటర్స్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మి÷-లలెట్లతో తయారు చేసిన ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మి÷-లలెట్స్‌తో తయారు చేసిన ఐస్ క్రీమ్, కాఫీ, తదితర పదార్థాలను మంత్రి రుచి చూసి, తయారీ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. పాలు, పండ్లు, కాయగూరలు, మసాల దినుసులు, చిరుధాన్యాలు, టీ పౌడర్ , పప్పు దినుసుల్లో కల్తీని ఎలా గుర్తించాలో తెలుపుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాల్లో జరిగిన కల్తీని ఎలా గుర్తించాలో, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సైంటిస్టులు మంత్రికి వివరించారు. ఆయా పద్ధతులను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఇప్ప పువ్వుతో లడ్డులు, ఇతర ఆహార పదార్థాలను తయారు చేసి.. సక్సెస్‌ఫుల్‌గా బిజినెస్ రన్ చేస్తున్న మహిళా సంఘం సభ్యురాలిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. స్టాళ్ల సందర్శన అనంతరం జరిగిన సభలో స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు మంత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల ప్రతినిధులకు హైజీన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు. ఫుడ్ సేఫ్టీ - న్యూట్రీషియస్ ఫుడ్ ట్రైనింగ్‌లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏం తినాలో, ఎంత తినాలో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, మనం తింటున్న ఆహార నాణ్యత గురించి తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం అని పేర్కొన్నారు. 'మంచి ఆహారపు అలవాట్ల గురించి, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల గురించి తెలుసుకోవడానికి ఈట్ రైట్ మేళా వంటి కార్యక్రమాలు ఇందుకు ఎంతో దోహదపడుతాయి. ఆరోగ్యం బాగున్నప్పుడే, జీవితం ఆనందంగా ఉంటుందన్న విషయాన్ని బిజీ లైఫ్‌లో పడి మనం మర్చిపోతున్నాం. డబ్బు, ఉద్యోగం, సౌకర్యాలు అన్నీ ఉన్నా? ఆరోగ్యం లేకపోతే వాటికి విలువ ఉండదు. ఇటీవలి కాలంలో మన ఆహారపు అలవాట్లు మారిపోయాయి. బయట ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం పెరిగింది. దీంతో పాటు, శారీరక శ్రమ, ఫిజికల్ యాక్టివిటీ తగ్గిపోయింది. ఇది ఆందోళన కలిగించే విషయం. రోజూ కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయడం చాలా అవసరం. వాకింగ్, యోగా, గేమ్స్... ఏదైనా ఒకటి మన నిత్య జీవితంలో భాగం కావాలి. శరీరం కదిలితేనే ఆరోగ్యం బాగుంటుంది. శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు.. మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమైనది. ఈ రోజుల్లో ఒత్తిడి, ఆందోళన ఎక్కువవుతున్నాయి. సమయానికి తినకపోవడం, నిద్రలేమి, వ్యాయామం లేకపోవడం వంటివన్నీ మన మనసుపై కూడా ప్రభావం చూపుతున్నాయి. సరైన ఆహారం, వ్యాయామం, మంచి నిద్ర ఉంటేనే మనిషి సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారు. ఈ పరిస్థితుల్లో, 'ఈట్ రైట్' అనే భావన చాలా కీలకం. మనము తినే ఆహారమే, మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది కాబట్టి, ఏం తినాలో, ఎక్కడ తినాలో ప్రజలు తెలుసుకోవాలి. వీలైనంత వరకూ ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తినడం మంచిది. ఆహారంతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయాలి, మనసుకు ప్రశాంతత కలిగించే జీవనశైలిని అలవరచుకోవాలి. ఆహార కల్తీ జరుగుతున్నట్టు మీ దృష్టికి వస్తే, వెంటనే పోలీసులకు లేదా ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేదా ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. తక్షణమే కఠిన చర్యలు తీసుకునే బాధ్యత మాది.' అని మంత్రి ప్రజలకు సూచించారు.

## ఓటర్ జాబితా అప్‌డేట్‌కు గడువు

### సర్ ప్రక్రియపై సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ,ఏప్రిల్ 7(ఆర్ఎన్ఎ):** పశ్చిమ బెంగాల్ ఓటరు లిస్ట్ అప్‌డేట్‌కు సుప్రీం కోర్టు ఒకరోజు గడువు విధించింది. రాష్ట్రంలో నిర్వహించిన ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను పునఃపరిశీలించాలని ప్రత్యేక విస్తృత పునర్విచారణ ట్రైబ్యునల్స్‌ను ఆదేశించింది. ఓటరు లిస్ట్ నుంచి పేర్లను తొలగించడానికి న్యాయాధికారులు ఇచ్చిన కారణాలతో సహా మొత్తం పత్రాలను పరిశీలించి, నిష్పక్షపాతంగా విచారణ జరపాలని సూచించింది. ఓటరు జాబితాలో పేర్ల తొలగింపునకు వ్యతిరేకంగా దాఖలైన అప్పీళ్లను నిర్ణయించేందుకు ట్రైబ్యునళ్లు అనుసరించాల్సిన విధానాలను సూచించేందుకు.. ముగ్గురు మాజీ న్యాయమూర్తులతో ఒక ప్యానల్ ఏర్పాటు చేయాలని కలకత్తా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిని సుప్రీంఆదేశించింది. ట్రైబ్యునల్స్ పనితీరుకు సంబంధించిన పరిపాలనాపరమైన అంశాలనూ పర్యవేక్షించాలని సూచించింది. ఓటర్లు ఆన్‌లైన్‌లోనే కాకుండా ఆఫ్‌లైన్‌లోనూ తమ అప్పీళ్లను దాఖలు చేయడానికి వీలుగా రసీదులు జారీ చేయాలని జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయాన్ని ఆదేశించింది. మరోవైపు ఓటర్ల జాబితాలోని పేర్లు తొలగించడం లేదా కొత్త పేర్లను చేర్చడంపై వచ్చే అప్పీళ్లను విచారణ చేయడానికి 19 అప్పీలేట్ ట్రైబ్యునల్స్ ఏర్పాటు చేసినట్లు సుప్రీం కోర్టుకు ఎన్నికల సంఘం తెలియజేసింది

## పిడుగుపాటుకు మరొకరు బలి

### మార్కాపురంలో కన్నయ్య అనే వ్యక్తి మృతి

**విజయవాడ, ఏప్రిల్ 7 (ఆర్ఎన్ఎ):** ఆంధ్రప్రదేశ్‌లో వరుస పిడుగుపాటులు తీవ్ర విషాదాన్ని మిగులుచ్చు తున్నాయి. ఆదివారం శ్రీకాకుళం, తిరుపతి జిల్లాల్లో పిడుగులు పడి ముగ్గురు మృతిచెందారు. కాగా, సోమవారం మార్కాపురం జిల్లాలోనూ ఘోర విషాదం చోటు చేసుకుంది. పుల్లలచెరువులోని మొక్కజొన్న ఫ్యాక్టరీపై పిడుగుపడింది. పిడుగుపాటుకు గురై కన్నయ్య(28) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా.. మరో నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన వారిని యర్రగొండపాలెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుల పరిస్థితిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఆదివారం నాడు శ్రీకాకుళం జిల్లా మందస మండలం బి.కేసుపురంలో భారీ వర్షం కురిసింది. అప్పటికే పొలం పనుల కోసం వెళ్లిన తల్లీకుమార్తె మడియ కృష్ణవేణి(35), మడియ యోగేశ్వరి(15) వర్షం కారణంగా చెట్టు కిందకు వెళ్లారు. ఆ సమయంలో భారీ పిడుగుపడి వారిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. అలాగే తిరుపతి జిల్లాలోనూ పిడుగుపాటు ఓ వ్యక్తి మృతిచెందాడు. శ్రీకాళహస్తి మండలం కలవగుంటలో ఈ ఘటన చోటు చేసుకుంది. కల్లు గీసేందుకు వెళ్లిన కార్మికుడు వి.కామరాజ్(35)పై పిడుగుపడడంతో తుదిశ్వాస విడిచాడు. కామరాజ్‌ను వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అయితే, బంగాళాఖాతంలో ద్రోణి విస్తరించి ఉన్న కారణంగా ఏపీ వ్యాప్తంగా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు, రైతు కూలీలు, పశువుల కాపరులు అప్రమత్తంగా ఉండాలని ఏపీ విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

## బైకర్ స్పీడ్ ఇంకా పెరగాలి



శర్వానంద్ హీరోగా అభిలాష్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన బైకర్ తొలి రెండు రోజులు నెమ్మదిగానే నడిచింది. టాక్ స్లోగా ఉండటం, యూత్ మద్దతు ఎక్కువగా రాకాసకు కనిపించడం లాంటి కారణాలు కొంత ప్రభావితం చేశాయి. అయితే అనూహ్యంగా బైకర్ వీక్ డేస్ లో పికప్ అయ్యింది. గత ఇరవై నాలుగు గంటల్లో బుక్ మై షోలో బైకర్ సగటున 15 వేలకు పైగా టికెట్లు అమ్మగా రాకాస కొంచెం వెనుకబడి 13 వేల పైచిలుకు దగ్గర ఉంది. ఆదివారం దాకా ఇది రివర్స్ లో నడిచింది. అయితే వీటిని బట్టి బైకర్ ఏదో బ్లాక్ బస్టర్ అయిపోతుందని వెంటనే తేల్చలేం. ఎందుకంటే ఇప్పుడీ పికప్ ని మరింతగా పెంచుకుని వచ్చే ఆదివారం దాకా స్పీడ్ కొనసాగించాలి. కానీ శుక్రవారం డెకాయిట్, లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ, పళ్ళి చట్టంబి లాంటి కొత్త రిలీజులు ఉన్నాయి కాబట్టి వాటి ఎఫెక్ట్ ఎంత ఉంటుందనే దాన్ని బట్టి వసూళ్ల లెక్కలు ఉంటాయి. నిర్మాణ సంస్థ అధికారికంగా ప్రకటించిన దాని ప్రకారం బైకర్ ఫస్ట్ వీకెండ్ కి పద్దెనిమిది కోట్ల గ్రాస్ దాటేసింది ఇది నిజమైన పక్షంలో బ్రేక్ ఈవెన్ కి ఇంకా సగం దూరం పైనే ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇది అంత ఈజీ కాదు. బ్లాక్ బస్టర్ టాక్ వస్తే అసాధ్యం కాదు కానీ బైకర్ కు వచ్చింది డీసెంటనే మాట మాత్రమే. సో కొంచెం గట్టి యుద్ధమే చేయాల్సి ఉంటుంది. ఐపీఎల్ ప్రభావం కూడా గట్టిగానే ఉంది. ఇంకోవైపు రాకాస అనూహ్యంగా నెమ్మదించడం ఊహించనిది. టీమ్ ప్రమోషన్లు కొనసాగిస్తోంది. సిడెడ్ నుంచి సక్సెస్ టూర్ మొదలుపెట్టి అన్ని ప్రాంతాలకు వెళ్తోంది. శర్వానంద్ చెప్పుకున్నట్టు బైకర్ తన పెర్ఫార్మన్స్ పరంగా కెరీర్ బెస్ట్ అవ్వొచ్చేమో కానీ కమర్షియల్ గా ఎంత మేర సేఫ్ అవుతుందనేది ఇంకో వారం ఆగాక క్లారిటీ వస్తుంది. యువి క్రియేషన్ దీని మీద నలభై కోట్ల దాకా బ్రేక్ ఈవెన్ టార్గెట్ పెట్టుకుంది. అన్ని వర్గాల ఆడియెన్స్ మద్దతు దొరికితే ఇదేమి అసాధ్యం కాదు. కాకపోతే బిసి సెంటర్స్ లో స్లోగా ఉండటం, నెంబర్లు ఆశించినంత పెద్ద స్థాయిలో పెరగకపోవడం బైకర్ ఎదురుకుంటున్న చాలా పెద్ద సవాల్.


## రావణుడిని అంత గొప్పగా చూపించగలరా



ఇటీవలే విడుదలైన రామాయణ పార్ట్ 1 టీజర్ మీద మిశ్రమ స్పందన వచ్చిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియా ఫీడ్ బ్యాక్ ఎలా ఉన్నా టీమ్ మాత్రం తామో గొప్ప అద్భుతాన్ని చూపించిన ఫీలింగ్ లో ఉంది. ఇదిలా ఉండగా దర్శకుడు నితేశ్ తివారి ఈ సినిమాకు సంబంధించిన పలు ఆసక్తికరమైన కబుర్లు పంచుకున్నారు. ముఖ్యంగా యష్ పోషించిన రావణుడి పాత్ర గురించి ఓ రేంజ్ ఎలివేషన్లు ఇస్తున్నారు. నెగటివ్ కన్నా ఎక్కువగా పాజిటివ్ ఉంటుందని ఊరిస్తున్నారు. రావణుడిని కేవలం సీతను అపహరించిన కోణంలో కాకుండా తనలో ఉన్న వీరత్వం, సంగీత కళ, శివ భక్తి తత్వం, ప్రజలను చక్కగా పాలించిన వైనం లాంటివి చూపించబోతున్నట్టు చెప్పారు. స్వార్థం, పరస్త్రీ మీద వ్యామోహం మనిషి పతనానికి ఎలా దారి తీస్తాయో ఒక పాఠం రూపంలో ప్రేక్షకులకు వివరిస్తామని అంటున్నారు. కెజిఎఫ్, టాక్సిక్ తర్వాత యష్ ఒప్పుకున్న మూవీ ఇదే. రావణుడిగా అయినా సరే గ్రీన్ సిగ్నల్ ఇవ్వడానికి కారణం నితేశ్ తివారి నేరేషనే. అయితే రావణుడికి సంబంధించి ఒక గొప్ప క్యారెక్టరైజేషన్ చూపించిన నటుల్లో ముందుగా చెప్పుకోవాల్సింది స్వర్గీయ ఎన్టీఆర్ గురించే. సీతారామకళ్యాణం, భూకైలాస్ లో ఆయన చూపించిన వేరియేషన్లు వాటిని మరపురాని మాస్టర్ పీసెస్ గా చేశాయి. తర్వాత సంపూర్ణ రామాయణంలో ఎస్వీ రంగారావు రావణుడిగా ప్రాణ ప్రతిష్ట చేశారు. తర్వాత ఇంకెవరు ఈ స్థాయిలో ప్రభావం చూపించిన నటులు లేరు. ఆదిపురుష్ లో సైఫ్ అలీఖాన్ ని గుర్తు చేసుకోకపోవడం ఉత్తమం. సో రామాయణ వచ్చినప్పుడు ఖచ్చితంగా ఇలాంటి పోలికలు వస్తాయి. యష్ లోని అసలైన నటుడిని కూడా ఈ సందర్భంగానే బయటికి తీయొచ్చు. ఒకవేళ ఒకనాటి క్లాసిక్స్ ని గుర్తు చేసే స్థాయిలో కనక యాక్టింగ్ చేయగలిగితే అవార్డులకు ఆకాశమే హద్దు అవుతుంది. నితేశ్ తివారి అంత గొప్పగా పాత్ర చిత్రణ చేశారా లేదానేది ఇక్కడ కీలకం కానుంది. ఏఆర్ రెహమాన్, జిమ్స్ హ్యామర్ సంగీతం సమకూరుస్తున్న ఈ విజువల్ గ్రాండియర్ లో రన్బీర్ కపూర్, సాయిపల్లవి సీతారాములుగా నటిస్తున్నారు.




## పెద్ది... పెద్ద మనసు చేసుకుని చెప్పేసెయ్



ఇండస్ట్రీ, ప్రేక్షకులు అందరూ ఎదురు చూస్తున్న క్షణం పెద్ది అనౌన్స్ మెంట్. ఏప్రిల్ 30 రావడం లేదని ప్రపంచం మొత్తం కోడై కూస్తున్నా నిర్మాణ సంస్థలు మాత్రం పెదవి విప్పడం లేదు. దీనికి తోడు రామ్ చరణ్ మొన్న రాకాస ఇంటర్వ్యూలో లేట్ లేదని చెప్పడం, ట్విట్టర్ వేదికగా డిస్ట్రిబ్యూటర్ల లిస్టు ఒక్కొక్కటిగా బయటికి రావడం అనుమానాలు పెంచుతున్నాయి తప్పించి తగ్గించడం లేదు. దీని వల్ల బయ్యర్లు ఏమో కానీ అభిమానులు ఒత్తిడికి గురవుతున్నారు. తాజా సమాచారం మేరకు పెద్ది ఏప్రిల్ 30 రావడం లేదు. ఎలాంటి టెన్షన్ లేకుండా తగినంత సమయం దొరికేలా జూన్ 4 లేదా జూన్ 25 రెండు ఆప్షన్ల మీద కసరత్తు చేస్తున్నారట. మొదటి డేట్ కి టాక్సిక్ ఉంది కాబట్టి జూన్ మూడో వారానికి షిఫ్టయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఒకవేళ యష్ రానంటే మాత్రం రామ్ చరణ్ రంగంలోకి దిగవచ్చు. పెద్ది ప్రకటన రాగానే మా ఇంటి బంగారం, స్వయంభు లాంటివి డేట్లు వేసుకోవడానికి రెడీగా ఉన్నాయి. గాయపడ్డ సింహం ఆల్రెడీ మే 1 వస్తుంది. సో ఇంత క్లారిటీ బయటి వర్గాలకు ఉన్నప్పుడు ప్రొడక్షన్ హౌస్ వీలైనంత త్వరగా స్పందిస్తే మంచిది. ప్రస్తుతం ఐటెం సాంగ్ ఏర్పాట్లలో బిజీగా ఉన్న దర్శకుడు బుచ్చిబాబు అందులో ఎవరు డాన్స్ చేస్తారనేది బయట పెట్టడం లేదు.

## మాస్ మసాలా వదలని నాగశౌర్య



రంగబలి తర్వాత నాగశౌర్య తెరమీద కనిపించి రెండేళ్లు దాటిపోయింది. వరస డిజాస్టర్లతో మార్కెట్ డ్యామేజ్ అయిన టైంలో సరైన కంబ్యాక్ కోసం అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఛలో తర్వాత మళ్ళీ అంత పెద్ద హిట్టు తనకు దక్కపోవడం విచిత్రమే. ఇదిలా ఉండగా నాగ శౌర్య కొత్త మూవీ బ్యాడ్ బాయ్ కార్తీక్ ఈ నెల ఏప్రిల్ 17 విడుదలకు రెడీ అవుతోంది. ఈ సందర్భంగా ట్రైలర్ లాంచ్ చేశారు. తెలిసో తెలియకో తప్పులు చేశామని నిర్మాత హీరోకు సారి చెప్పడం వైరల్ అవుతోంది. ఇక ట్రైలర్ విషయానికి వస్తే నాగశౌర్య ఈసారి కూడా ఓవర్ మాస్ ట్రై చేసినట్టు ఉన్నాడు. అన్యాయాన్ని సహించని హీరో, ఒక అవినీతి రాజకీయ నాయకుడు, ఒక మాఫియా డాన్, జులాయిలో రాజేంద్ర ప్రసాద్ లాంటి ఒక కామెడీ పోలీస్ ఆఫీసర్ వెరసి పక్కా ఫార్ములా తరహాలో కంటెంట్ వెళ్ళిపోయింది. ఒక షాట్ లో నాగశౌర్య కత్తి పట్టుకుని రౌడీల మీదకు వస్తుంటే వెనుక నరసింహస్వామి స్వరూపాన్ని బ్యాక్ షాట్ లో చూపించడం బోయపాటి శీనుని గుర్తు చేసింది.

## డెకాయిట్ అంచనాల మీటర్ ఎలా ఉంది



ఇంకో మూడు రోజుల్లో డెకాయిట్ థియేటర్లలో అడుగు పెట్టేస్తాడు. హైదరాబాద్ లాంటి మెయిన్ సెంటర్స్ అడ్వాన్స్ బుకింగ్స్ మొదలైపోయాయి. టికెట్ల అమ్మకాలు బాగానే ఉన్నాయి. అన్ని చోట్ల ఓపెన్ అయ్యాక ట్రెండింగ్ ఏ స్థాయిలో ఉందనేది క్లారిటీ వస్తుంది. అయితే ట్రైలర్ వచ్చాక డెకాయిట్ సౌండ్ కొంచెం తగ్గిందనే కామెంట్స్ సోషల్ మీడియాలో వినిపిస్తున్నాయి. కథని రివీల్ చేసినప్పటికీ ఫాస్ట్ గా కట్ చేసిన విధానం మాస్ కు అంతగా రీచ్ కాలేదన్నది నెటిజెన్స్ టాక్. డెకాయిట్ మీద ముందు నుంచి మంచి యాక్షన్, ఛేజింగ్ సినిమానే అంచనాలు ఆడియన్స్ లో బలంగా ఉన్నాయి. అయితే కొత్తగా లవ్ స్టోరీ యాంగిల్ లో ప్రమోట్ చేయడంతో ఫ్యామిలీ, యూత్ ఆడియన్స్ ని టార్గెట్ చేసిన వైనం కనిపిస్తోంది. డెకాయిట్ కి ఈ వారం మంచి అవకాశం ఉంది. బైకర్, రాకాసలు డీసెంట్ టాక్ తో కొంత మేర నెట్టుకొస్తున్నాయి కానీ ఎక్స్ ట్రాడినరి టాక్ రాకపోవడం కలెక్షన్లను ప్రభావితం చేస్తోంది. దీన్ని డెకాయిట్ పూర్తిగా వాడుకోవాలి. అడివి శేష్ మీద ఉన్న నమ్మకం ఓపెనింగ్స్ కి దోహదపడుతుంది. హిట్ 2 ది సెకండ్ కేస్ తర్వాత శేష్ మళ్ళీ స్క్రీన్ మీద కనిపించలేదు. అందుకే డెకాయిట్ మీద జనాల్లో స్పెషల్ ఇంట్రెస్ట్ ఉంది. దర్శకుడు షానియేల్ డియో ఎవరికీ తెలియదు. సో ఆ బ్రాండ్ పనిచేయదు. భీమ్స్ సిసిరోలియో ఇచ్చిన పాటలు కూడా మరీ ఛార్ట్ బస్టర్ కాదు. బాగానే ఉన్నాయి కానీ వైరల్ అయ్యే స్థాయిలో లేకపోవడం కొంత మైనస్ అయ్యింది. విజువల్ గా క్లిక్ అవుతాయేమో చూడాలి. పోటీపరంగా డెకాయిట్ పెద్ద రిస్క్ లో లేదు. లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ కేవలం ప్రదీప్ రంగనాథన్ ఫేస్ వేల్యూ మీద బిజినెస్ చేస్తోంది. అయితే అర్థమయ్యి కానట్టు ట్రైలర్ లో చూపించింది అంచనాలు పెంచలేకపోయింది. ఇక పల్లి చట్టంబిలో మలయాళ ఫ్లేవర్ మనోళ్ళకు ఎంత మేరకు కనెక్ట్ అవుతుందనేది అనుమానంగానే ఉంది. లక్కీగా అక్షయ్ కుమార్ భూత్ బంగ్లా ఒక వారం వాయిదా పడటం హిందీ మార్కెట్లలో ఉపయోగపడుతుంది. హిట్ టాక్ వస్తే పండగే.




## నాలుగోరోజూ లాభాల్లో సూచీలు.. 23వేల ఎగువకు నిఫ్టీ




దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ లాభాల్లో ముగిశాయి. ఉదయం నష్టాల్లో ప్రారంభమైన సూచీలు.. కనిష్ఠాల వద్ద కొనుగోళ్ల మద్దతుతో రాణించాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ బెదిరింపులతో ఉదయం ఓ దశలో సెన్సెక్స్ 800 పాయింట్లు నష్టపోయింది. మధ్యాహ్నం తర్వాత సీన్ మారింది. క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో మన మార్కెట్ సూచీలూ రాణించాయి. ముఖ్యంగా ఐటీ స్టాక్స్‌లో కొనుగోళ్ల మద్దతు కలిసొచ్చింది. సెన్సెక్స్ ఉదయం 73,734.36 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 74,106.85) నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 73,282.41 వద్ద కనిష్ఠాన్ని తాకింది. తర్వాత పుంజుకొని 509.73 పాయింట్ల లాభంతో 74,616.58 వద్ద ముగిసింది. నిఫ్టీ 155.40 పాయింట్ల లాభంతో 23,123.65 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, సన్‌ఫార్మా స్టాక్స్ లాభపడ్డాయి. ఇండిగో, అదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టైటాన్, ట్రెంట్ స్టాక్స్ నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 110 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 4663 డాలర్ల వద్ద కొనసాగుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పీ, జపాన్ నిక్కీ, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ రాణించాయి. యూరోపియన్ మార్కెట్‌లు కూడా లాభాల్లో ప్రారంభమయ్యాయి.

## కొవిడ్ తరహా ప్యాకేజీ.. వారికి 2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్



పశ్చిమాసియా యుద్ధం కారణంగా ప్రభావితమైన రంగాలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. వ్యాపారాలను, ముఖ్యంగా ఎంఎస్ఎంఈలను ఆదుకునేందుకు రూ.2.5 లక్షల కోట్లతో క్రెడిట్ గ్యారెంటీ స్కీమ్‌ను సిద్ధం చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఈ స్కీమ్ కింద బ్యాంకులు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం హామీగా ఉంటుంది. ఒకవేళ వ్యాపారాలు నష్టపోయి అప్పు తీర్చలేని పరిస్థితి వస్తే.. ప్రభుత్వం 90 శాతం (గరిష్ఠంగా రూ.100 కోట్ల వరకు) గ్యారెంటీ ఇస్తుంది. ప్రభుత్వ అనుబంధ సంస్థ అయిన నేషనల్ క్రెడిట్ గ్యారెంటీ ట్రస్టీ కంపెనీ నుంచి ఈ గ్యారెంటీ లభిస్తుంది. ప్రభుత్వం రూ.17వేల నుంచి రూ.18 వేల కోట్లు మేర ఈ స్కీమ్ కింద వెచ్చించనుంది. కొవిడ్-19 సమయంలో వివిధ రంగాలను ఆదుకునేందుకు ప్రభుత్వం ఇదేరీతిన 2020లో ఓ ప్యాకేజీని ప్రకటించింది. ఆత్మనిర్భర్ భారత్ అభియాన్‌లో భాగంగా ఎంఎస్ఎంఈలు, ఇతర వ్యాపారులను ఆదుకునేందుకు ఎమర్జెన్సీ క్రెడిట్ లైన్ గ్యారెంటీ స్కీమ్ ను తీసుకొచ్చింది. దీనికింద అన్నిరంగాలకు 100 శాతం గ్యారెంటీతో రుణాలు అందించింది. ఈ పథకం కింద బ్యాంకులు లేదా ఆర్థికసంస్థలు ఇచ్చే రుణాలకు ప్రభుత్వం గ్యారెంటీ ఇస్తుంది. అప్పు తీసుకున్నవారు తిరిగి చెల్లించలేకపోతే, ప్రభుత్వం ఆ బాధ్యతను తీసుకుంటుంది. పూచీకత్తు లేకుండా తక్కువ వడ్డీకే రుణాలు అందించింది. దేశ ఆర్థికవ్యవస్థపై యుద్ధ ప్రభావం పడకుండా ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు తీసుకుంది. పెరిగిన చమురు ధరల ప్రభావం వినియోగదారుల మీద భారం పడకుండా పెట్రోల్, డీజిల్‌పై రూ.10 మేర ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించింది. డీజిల్‌పై లీటరుకు రూ.21.50, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్‌పై లీటరుకు రూ.29.50 చొప్పున ఎగుమతి సుంకం విధించింది. కీలక పెట్రో కెమికల్ ఉత్పత్తులకు దిగుమతి సుంకాన్ని మినహాయించింది. తాజాగా యుద్ధ ప్రభావిత రంగాలకు మద్దతు ఇచ్చేందుకు త్వరలో ఈ పథకాన్ని అధికారికంగా ప్రకటించనుంది. యుద్ధ ప్రభావిత రంగాలను ఆదుకుంటామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ప్రకటించారు.

## విమాన ప్రయాణికులకు ఎయిరిండియా షాక్.. సర్‌ఛార్జీ పెంపు




టాటా గ్రూప్‌నకు చెందిన ప్రముఖ విమానయాన సంస్థ ఎయిరిండియా గ్రూప్ విమాన ప్రయాణికులకు షాకిచ్చింది. దేశీయ, అంతర్జాతీయ విమాన ప్రయాణ టికెట్లపై ప్రస్తుతం వసూలుచేస్తున్న ఫ్యూయల్ సర్‌ఛార్జీని పెంచేసింది. దేశీయ మార్గాల్లో విమాన టికెట్లపై కనిష్ఠంగా రూ.299 నుంచి రూ.899 చొప్పున వసూలుచేయనుంది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు 24 డాలర్ల నుంచి 280 డాలర్లకు వరకు వసూలుచేయనున్నట్లు ప్రకటించింది. కొత్త ఛార్జీలు డొమెస్టిక్ ప్రయాణికులకు ఏప్రిల్ 8 నుంచి అంతర్జాతీయ ప్రయాణికులకు 10 నుంచి వసూలుచేస్తామని తెలిపింది. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో విమాన ఇంధన (ఏటీఎఫ్) ధరను చమురు మార్కెటింగ్ సంస్థలు ఏప్రిల్ 1న సవరించాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధర బాగా పెరిగినా విమానయాన సంస్థలపై కేవలం 25% (లీటరుకు రూ.15) భారాన్ని మాత్రమే మోపుతున్నట్లు పెట్రోలియం మంత్రిత్వశాఖ తెలిపింది. పన్నులతో కలిపి చూస్తే ఏటీఎఫ్ ధర పెంపు 8.5 శాతంగా ఉంటుందని తెలిపింది. ఈ నేపథ్యంలో ఏటీఎఫ్ ధరలు పెరిగిన మరుసటిరోజే ఇండిగో ఫ్యూయల్ ఛార్జీలను సవరించగా.. ఎయిరిండియా తాజాగా నిర్ణయం తీసుకుంది. ఎయిరిండియాతో పాటు, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ విమాన ప్రయాణాల పైనా ఈ భారం పడనుంది.

పెంపు ఇలా..

దేశీయ విమాన సర్వీసులకు ప్రయాణించే దూరాన్ని బట్టి ఫ్యూయల్ సర్‌ఛార్జి వర్తిస్తుంది. 0-500 కిలోమీటర్లకు రూ.299; 501-1000 కిలోమీటర్ల వరకు రూ.399; 1001-1500 కిలోమీటర్ల వరకు రూ.549; 1501-2000 కిలోమీటర్ల వరకు రూ.749; 2వేల కిలోమీటర్ల పైబడి ప్రయాణ టికెట్లపై రూ.899 చొప్పున ఫ్యూయల్ సర్‌ఛార్జీ వసూలు చేయనున్నారు. అంతర్జాతీయ ప్రయాణికులకు కనిష్ఠంగా 24 డాలర్లు వసూలు చేయనున్నారు. పశ్చిమాసియాకు 50 డాలర్లు, ఆగ్నేయాసియా 100; సింగపూర్ 60, ఆఫ్రికా 130, యూకేకు 205, ఉత్తర అమెరికా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు 280 డాలర్లు చొప్పున ఈ ఫ్యూయల్ సర్‌ఛార్జిని వసూలు చేయనున్నట్లు ఎయిరిండియా గ్రూప్ పేర్కొంది.

## రూ.40 వేలు పెరిగిన 390 డ్యూక్ ధర!



భారతదేశంలో దిగ్గజ కంపెనీలు తమ వాహనాల ధరలను పెంచుతున్న తరుణంలో.. కేటీఎమ్ ఇండియా కూడా తన 390 డ్యూక్ ధరను రూ. 40,000 పెంచింది. దీంతో ఈ మోటార్‌సైకిల్ ధర రూ. 3.39 లక్షలకు (ఎక్స్-షోరూమ్) చేరింది. 2025 సెప్టెంబర్ చివరిలో.. అమల్లోకి వచ్చిన జీఎస్టీ 2.0 కింద ప్రవేశపెట్టిన సవరించిన జీఎస్టీ విధానం నేపథ్యంలో ఈ పెరుగుదల జరిగింది. కొత్త పన్ను విధానం ప్రకారం.. 350 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న మోటార్‌సైకిళ్లపై ఇప్పుడు 40 శాతం జీఎస్టీ విధిస్తారు. కాబట్టి ఇప్పుడు కంపెనీ బైక్ ధరను పెంచింది. ప్రకటన వెల్లడించిన సమయంలో.. భారతదేశంలో బజాజ్ ఆటో ఆధ్వర్యంలో పనిచేస్తున్న కేటీఎం ఇండియా, ట్రయంఫ్ మోటార్‌సైకిల్స్ రెండూ.. తమ తమ 390 మరియు 400ఎక్స మోడళ్ల ధరలు యథాతథంగా ఉంటాయని, అదనపు ఖర్చులను కంపెనీయే భరిస్తుందని పేర్కొన్నాయి.

# వేసవిలో తాగునీటి సమస్యపై బోర్ మరమ్మత్తులు చర్యలు

## 23 వార్డ్ కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు



**హుజూర్ నగర్ ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్):** హుజూర్ నగర్ పట్టణంలో శ్రీనగర్ కాలనీ నందులో వేసవిని దృష్టిలో పెట్టుకొని వార్డు ప్రజలకు తాగునీటి కోసం ఇబ్బందులు పడకుండా ప్రత్యేక దృష్టి వహించి పట్టణ చైర్మన్ దొంతగాన శ్రీనివాస్ గౌడ్ సహకారంతో చర్యలు చేపట్టిన 23 వార్డ్ కౌన్సిలర్ అట్లూరి మంజుల హరిబాబు వార్డ్ లో ఉన్న చింతల బజార్, ఎల్లమ్మ పుట్ట మరియు ఎన్టీఆర్ బజార్ ప్రైమరీ స్కూల్ దగ్గర ఉన్న మంచినీటి బోర్ మరమ్మత్తులు చేసి వార్డు ప్రజలకు తాగునీటి కోసం ఇబ్బంది లేకుండా అదేవిధంగా ఎండాకాలం మంచినీటి సమస్యతో ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో మంచినీటి బోరును మరమ్మత్తులు చేపించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పల్లపు నరసింహారావు బోడ వరలక్ష్మి సర్విశెట్టి సత్యవతి నాగేళ్ల క్రాంతి కుమార్ పల్లపు సావిత్రి గంద్రపు సుజాతతదితరులు పాల్గొన్నారు.

# అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన రైతు నాగవత్ రాజు కుటుంబాన్ని ఆదుకోవాలి

## రైతు స్వరాజ్య వేదిక డిమాండ్



**ములుగు, ఏప్రిల్:7(నేటిమనదేశమ్ ప్రతినిధి)** ములుగు జిల్లా ములుగు మండలం దేవగిరిపట్నం గ్రామానికి చెందిన నగావత్ రాజు, వయసు 40 తండ్రి, హర్యానాయక్, అనే కౌలు రైతు, అప్పుల బాధతో, జనవరి 23న ఆత్మహత్య చేసుకున్నాడు ఇట్టి విషయం తెలుసుకున్న రైతు స్వరాజ్య వేదిక. రాష్ట్ర కమిటీ ప్రతినిధి కర్నాటకపు సమ్మయ్య. ఇటీవల ఆయన కుటుంబాన్ని పరామర్శించి భార్య, వినోద, చెప్పిన ప్రకారం,గత అయిదు సంవత్సరాల కాలంగా,8,ఎకరాల భూమిని కౌలుకు తీసికొని, 3,ఎకరాల పత్తి, 5,ఎకరాల, వరి పంట సాగు చేసే వాడని, పంట పెట్టుబడి కోసం, 5,లక్షల, రూపాయలు, అప్పు తెచ్చి పెట్టడం జరిగిందని జరిగిందని మృతుని భార్య వినోద తెలిపిందని . ఆ సమయంలో, అధిక వర్షాలు పడడంతో, పంట మునిగి నష్టం వాటిల్లింది, దాని కారణంగా, పంట దిగుబడి రాకపోవడం వల్ల తెచ్చిన అప్పు తీర్చే మార్గం లేక, మనస్తాపానికి గురై 23,జనవరి 2020 న పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని వా పోయింది. వారికి ముగ్గురు పిల్లలు, స్వంత భూమి లేదు గనుక, ఆ పిల్లలను కూలీ చేసుకుంటూ జీవనం గడుపుతున్నారని .ఆ కుటుంబ పరిస్థితి దీనంగా ఉండడంతోఅట్టి నిరుపేద కుటుంబాన్ని, ఆదుకోవడానికి, రైతు స్వరాజ్య వేదిక సమన్వయంతో, రూరల్ డెవలప్మెంట్ సర్వీసు సొసైటీ వారు,మంగళవారం రోజున ఆ కుటుంబానికి, 50,వేలరూపాయలు ఆర్థిక సహాయం అందజేసి, బట్టల షాపు పెట్టించి, జీవనోపాధి కల్పించడం జరిగిందని ,రైతుస్వరాజ్య వేదిక రాష్ట్ర కమిటీ ప్రతినిధి,కర్నాటకపు సమ్మయ్య తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కౌలు రైతులను గుర్తిస్తూ,కౌలు రైతుల చట్టం,2011,ను,అమలు చేస్తూ వారికి బ్యాంకు లోన్లు,ఇప్పించాలనివారికి 421,జి,ఓ,ద్వారా 6, లక్షలరూపాయలు, ఎక్స్గ్రేషియా చెల్లించి కౌలు రైతు ఆత్మహత్య కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు స్వరాజ్య వేదిక రాష్ట్ర నాయకులు, బన్నూరి కొండల్ రెడ్డి, ముక్క అయిలన్న సమన్వయం . రైతు స్వరాజ్య వేదిక, వాలంటీర్, చల్లగురుగుల సంజీవ్, తదితరులు పాల్గొన్నారు

# స్టాక్ మార్కెట్ పేరుతో మోసం చేసిన ఇద్దరు అరెస్ట్.ఎస్పీ అఖిల్ మహాజన్



**అదిలాబాద్ ఏప్రిల్ 07 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** ఆన్లైన్ స్టాక్ మార్కెట్లో అధిక లాభాలు వస్తాయంటూ అమాయకులను మోసం చేసి దాదాపు ఒక కోటి 19 లక్షల వరకు వసూలు చేసిన ఇద్దరు ఘరానా మోసగాళ్లను ఉట్నూర్ పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలను వెల్లడించారు.ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు,ఈ కేసు నందు ఇద్దరు నిందితులు నిందితులు ఆన్లైన్ స్టాక్ మార్కెట్లో అధిక లాభాలు వస్తాయని నమ్మబలికి ఉట్నూర్,పరిసర గ్రామాల 25 మంది అమాయక ప్రజలను పెట్టుబడులు పెట్టేలా ప్రలోభపెట్టి, మొత్తం రూ.1,19,04,000/- వసూలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.అధిక లాభాలు వస్తాయంటూ అప్లికేషన్ ద్వారా లాభాలను చూపిస్తూ వారి వద్ద అధిక మొత్తంలో డబ్బులను వసూలు చేసి మోసం చేయడం జరిగిందని తెలిపారు.మోసం చేసి వసూలు చేసిన డబ్బులతో జల్సాలకు పాల్పడుతూ మరియు ఇల్లు,ఓపెన్ ప్లాట్స్ కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు.సోమవారం ఇద్దరూ నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.కేసు దర్యాప్తు కొనసాగుతోంది.అధిక లాభాల పేరుతో మోసాలకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఇంకా ఎవరైనా బాధితులు ఉంటే నిర్భయంగా జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సంప్రదించవలసిన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉట్నూర్ ఎస్సై గుంపుల విజయ్,సిబ్బంది నరేష్ , తానాజీ,బాబ్జీ,ఉష సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 17న హిందూ సమ్మేళనం విజయవంతం చేయండి...

## పోచమ్మబస్తీ అధ్యక్షులుగా ఎస్పీ సుబ్రహ్మణ్యం




**జగిత్యాల, ఏప్రిల్ 07(నేటి మన దేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని పోచమ్మ వాడ లో ఈనెల 17 శుక్రవారం రోజున నిర్వహించే హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని తపస్ రాష్ట్ర అధ్యక్షులు ఓడ్నాల రాజశేఖర్, పోచమ్మబస్తీ అధ్యక్షులుగా ఎస్పీ సుబ్రహ్మణ్యం తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సాంగ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ఆర్ఎస్ఎస్ పోచమ్మ వాడ బస్తి ఆధ్వర్యంలో స్థానిక పోచమ్మ గుడి వద్ద సాయంత్రం ఏర్పాటుచేసిన హిందూ సమ్మేళనంలో హిందూ బంధువులు కుటుంబాలతో సహా తరలిరావాలని కోరారు. భారతీయ సంస్కృతిని కాపాడుకొని హిందువుల ఐక్యతను చాటి చెప్పాలని కోరారు. మన దేశానికి ధర్మానికి హాని కలిగించే శక్తుల పట్ల వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రతి ఒక్కరు దేశభక్తి భావనతో ముందుకు సాగాలని ఉద్దేశంతో ఈ సమ్మేళనాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని ప్రతి ఒక్కరు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఇందు సమ్మేళన సమితి పోచమ్మబస్తీ అధ్యక్షులుగా ఎస్పీ సుబ్రహ్మణ్యం ప్రధాన కార్యదర్శిగా జంగిలి మల్లికార్జున్ మరియు సభ్యులుగా వర్ణాల మహేష్ మాసం రమేష్ సిద్ధి దశరథం బింగి రాజశేఖర్ తోకల రవి చింత లక్ష్మి పుప్పాల జయ ఖర్చు రవళి అక్కినేని శారద ఉప్పాల గంగ లక్ష్మి ఈశ్వరి సుశీల సర్వదేవేందర్ గంగం సుభాష్ పల్లికొండ రమేష్ గత్తిని మల్లేశం కొండ్ర జగన్ మారుపాక రాజేందర్ కనపర్తి లచ్చన్న మధు మునీందర్ మాసం రమేష్ భూమారెడ్డి రాజశేఖర్ పాల్గొన్నారు

# చదరంగంలో ప్రపంచ రికార్డును సాధించిన ఏకైక బాలుడిగా నిలిచిన కొండా శ్రేయాన్ష్ మురళీ కృష్ణ పటేల్




**జూబ్లీహిల్స్ ఏప్రిల్ 7 (నేటి మన దేశమ్ ప్రతినిధి)**మంగళవారం జూబ్లీహిల్స్ లోని ఎమ్మెల్యేస్ అండ్ ఎంపీస్ కాలనీ కల్చరల్ సెంటర్ లో వేడుకగా జరిగిన కార్యక్రమం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరిశ్రేయాన్ష్ కృష్ణ పటేల్ ప్రపంచ రికార్డ్ సాధించి, భరతమాత ముద్దు బిడ్డగా, అపార మేధస్సు కలిగిన స్వామి వివేకానందునిగా అవతరించాడని కీర్తించిన మంత్రి వాకిటి శ్రీహరిఉద్వేగంతో ఆనంద భాష్పాలు రాల్చిన మంత్రి సురేఖ, శ్రీయాన్ష్ అమ్మగారు కొండా సుస్మిత పటేల్కొండా శ్రేయాన్ష్ పటేల్ ప్రతిభా సామర్థ్యాలు, మేధస్సు అమోఘమని ప్రశంసించిన చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు రాజశేఖర్ రెడ్డిలిరాయ్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు శ్రీ రాజశేఖర్ రెడ్డి పర్యవేక్షణలో, నేషనల్ ఆర్బిటార్ ఉజ్వల్ చౌహాన్ జడ్జిగా సాగిన కార్యక్రమంరాయ్ చెస్ అకాడమీ తరఫున కొండా శ్రేయాన్ష్ పటేల్ కు ట్రోఫీలు, సర్టిఫికెట్ లను ప్రదానం చేసిన క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి త్వరలో వరల్డ్ బుక్ ఆఫ్ లండన్ ద్వారా బ్రిటిష్ పార్లమెంట్లో సత్కారంతో పాటు సర్టిఫికెట్ ను పొందనున్న శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ మంత్రి కొండా సురేఖ, మురళీధర్ రావుల మనవడు కొండా శ్రీయాన్ష్ మురళీకృష్ణ పటేల్ చెస్ క్రీడలో అరుదైన రికార్డును సాధించారు. క్రీడారంగంలో విశేష ఖ్యాతిగాంచిన రాయ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 15 నిమిషాల 52 సెకండ్స్ లలో 93 బ్యాక్ ర్యాంక్ చెక్ మేట్స్ ను పరిష్కరించడంతో పాటు, 1 గంట 9 నిమిషాల 9 సెకండ్స్ లలో 21 చెస్ బోర్డ్ లను అమర్చి, వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) లో రెండు ప్రపంచ రికార్డులను సాధించి శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ చరిత్ర సృష్టించాడు. రెండు సంవత్సరాల 11 నెలల అత్యంత పిన్న వయస్సులోనే ఈ రికార్డును సాధించిన ఏకైక బాలుడిగా ఖ్యాతికెక్కాడు.జూబ్లీహిల్స్ లోని ఎమ్మెల్యేస్ అండ్ ఎంపీస్ కాలనీ కల్చరల్ సెంటర్ లో విశేష అతిథుల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో అత్యంత ఉత్కంఠ నడుమ శ్రేయాన్ష్ కృష్ణ పటేల్ తన అద్భుత నైపుణ్యాలతో నిర్ణీత సమయంలో శ్రేయాన్ష్ కృష్ణ రికార్డును సాధించాడు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ.. చెస్ లో వరల్డ్ రికార్డ్ సాధించిన శ్రీయాన్ష్ మురళీ కృష్ణ పటేల్ కు అభినందనలు తెలిపారు. శ్రీయాన్ష్ పటేల్ 'నభూతో నా భవిష్యత్' అన్నట్లుగా ఆడటం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. జూన్ లో బ్రిటన్ పార్లమెంట్ లో అవార్డు అందుకోనున్న శ్రీయాన్ష్ కు శుభాకాంక్షలు తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడలకు అండగా ఉంటామని ప్రకటించారు. మంత్రి సురేఖ మాట్లాడుతూ.. శ్రేయాన్ష్ కృష్ణ ఎంతో ఓపికగా పజిల్స్ పరిష్కరించడంతో పాటు చెస్ బోర్డులను చాలా చక్కగా అమర్చడం అందరినీ ఉద్వేగానికి గురి చేసిందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ ఆనంద భాష్పాలు రాల్చారు. శ్రీయాన్ష్ ఆధ్యాత్మిక చింతన, క్రీడా నైపుణ్యాలు తమను అబ్బురపరుస్తాయని శ్రీయాన్ష్ అమ్మగారు కొండా సుస్మిత పటేల్ ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ దిశగా అతని ప్రతిభా సామర్థ్యాలను మరింతగా ప్రోత్సహించి, శ్రీయాన్ష్ లక్ష్యాల సాధనకు తమవంతు సహకారం అందిస్తామని సుస్మిత తెలిపారు.రెండు ప్రపంచ రికార్డులను సాధించిన కొండా శ్రీయాన్ష్ పటేల్ కు రాయ్ చెస్ అకాడమీ తరఫున అతిథుల చప్పట్ల మధ్య ట్రోఫీలు, సర్టిఫికెట్ లను మంత్రి కొండా సురేఖ గారితో కలిసి క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రదానం చేశారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ..




**ఆసిఫాబాద్, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబోధ్ ఆధ్వర్యంలో "ఆరోగ్యం కోసం అందరం కలిసి కట్టుగా నిలబడదాం" అనే నినాదంతో ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ కలెక్టర్ కార్యాలయం నుంచి ప్రారంభమై పట్టణ ప్రధాన వీధి గుండా అంబేద్కర్ చౌక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తూ పౌష్టికాహారం, పరిశుభ్రత, ఆరోగ్యకరమైన జీవనశైలి యొక్క ప్రాముఖ్యతను డాక్టర్ సుబోధ్ వివరించారు.ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పరిశుభ్రత పాటించడం అవసరమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యం, హెల్త్ ఎడ్యుకేటర్లు రషీద్, లలిత, ల్యాబ్ టెక్నీషియన్ సమ్రీన్, మెడికల్ కళాశాల సిబ్బంది, జూనియర్ డాక్టర్లు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యధిక కాన్పులు నిర్వహించిన బాన్సువాడ ఆసుపత్రి ఉత్తమ ఆసుపత్రి గా ఎంపిక




**కామారెడ్డి,ఏప్రిల్ 07.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా, వివిధ విభాగాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరోగ్య శాఖ సిబ్బందిని ఆసుపత్రులను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.ఈ క్రమంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యధిక కాన్పులు నిర్వహించిన బాన్సువాడ ఆసుపత్రి ఉత్తమ ఆసుపత్రి గా ఎంపిక చేయబడిన సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మంగళవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ్ నరసింహా చేతులమీదుగా డి సి హెచ్ ఎస్ డా,, విజయ భాస్కర్ రెడ్డి, ఆసుపత్రి సుపరేండెంట్ అవార్డు అందుకున్నారు.

## టీయూడబ్ల్యూజే (ఐజేయు) ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రాపెల్లి శ్రీనివాస్






**వేములవాడ, ఏప్రిల్ 07: నేటి మన దేశమ్ ప్రతినిధి** టీయూడబ్ల్యూజే (ఐజేయు) అనుబంధ వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా రాపెల్లి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. మంగళవారం నిర్వహించిన నూతన కార్యవర్గం ఎన్నికల పోలింగులో రాపెల్లి శ్రీనివాస్ 16 ఓట్ల తేడాతో అమరగొండ కిషన్ పై ఘన విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా ఉల్లెందుల మల్లేశం ఆరు ఓట్ల తేడాతో కలీం పాషాపై గెలుపొందారు. కోశాధికారిగా గడీల ప్రవీణ్ కుమార్, సహాయ కార్యదర్శిగా మదాం బాబు గెలుపొందారు. ఇదిలా ఉండగా, ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షుడుగా కంకణాల సాయి శరత్ బాబు, కార్యవర్గ సభ్యులుగా కొక్కుల శ్రీనివాస్, ఎనగందుల నగేష్, ఖాజా నయీముద్దీన్, గొంగళ్ళ రవికుమార్, తూపుకారి శ్రీనివాస్, పోకల ఆంజనేయులు, సయ్యద్ హబీబ్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని గెలుపొందారని ఎన్నికల అధికారి రేగుల దేవేందర్, సహాయ అధికారి పారువెల్ల శ్రీనివాస్ ప్రకటించారు.

## ప్రతినెలా 100కు పైగా ఫోన్ల రికవరీ ; ఈ ఏడాది ఇప్పటివరకు రూ 61 లక్షల విలువైన 384 ఫోన్లు స్వాధీనం

### జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర




**కామారెడ్డి,ఏప్రిల్ 07.(నేటి మనదేశమ్ ప్రతినిధి)**సెల్ ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా ఆందోళన అవసరం లేదని, సి ఈ ఐ ఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ తెలిపారు.ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాకుండా, అందులో బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫోటోలు మరియు కీలకమైన డేటా కూడా ఉంటాయని ఎస్పీ తెలిపారు. ఫోన్ పోగొట్టుకోవడం వల్ల వ్యక్తిగత భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉన్నందున జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు.ఈ నేపథ్యంలో ఇన్స్పెక్టర్ జె. నరేష్ పర్యవేక్షణలో ఆర్ఎస్ఐ బాలరాజు మరియు ఐదుగురు కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రతి నెల సగటున 100కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తూ బాధితుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తోందన్నారు.గణాంకాలను వెల్లడిస్తూ, గత ఏడాదిలోనే సుమారు రూపాయలు 3 కోట్ల విలువైన 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్లో భాగంగా గత 30 రోజుల్లో రూపాయలు 21లక్షల విలువైన 134 మొబైల్ ఫోన్లను రికవరీ చేయడం జరిగిందన్నారు.అలాగే సి ఈ ఐఆర్ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు కామారెడ్డి జిల్లాలో మొత్తం 4665 మొబైల్ ఫోన్లను గుర్తించి, సుమారు రూపాయలు 7.46 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అప్పగించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక బృందాన్ని అభినందించారు.చివరగా, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడంతో పాటు, సిమ్ కార్డును బ్లాక్ చేసి ఒుఒు.ఎవఅతీ.ప్త్రశీజ.అఅ వెబ్సైట్లో ఫోన్ ఐ ఎం ఈ ఐ బ్లాక్ చేయాలని కోరారు. మొబైల్ ద్వారానే సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున గుర్తుతెలియని లింకులు మరియు కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. రికవరీ అయిన మొబైల్ ఫోన్లను పొందేందుకు బాధితులు తమ వద్ద ఉన్న ధృవపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ ఎస్ ఐ బాలరాజు (ఫోన్: 8712686114) గారిని సంప్రదించి తమ మొబైల్ ఫోన్లను పొందవచ్చని తెలిపారు.

# రానున్న 5 రోజుల్లో అధిక ఎండలు - ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

## కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్



**కాకినాడ, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** కాకినాడ జిల్లాలోని 14 మండలాల్లో మంగళ వారం నుండి రానున్న 5 రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నెలకొంటాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు వేసవి ఎండలు, వడగాడ్పుల నుండి రక్షణకు అవసరమైన జాగ్రత్తలు పాటించాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ జిల్లా ప్రజలను కోరారు. జిల్లాలోని తాళ్లరేవు, కరప, కాజులూరు, కాకినాడ అర్బన్, రూరల్, పిఠాపురం, యు. కొత్తపల్లి, గొల్లప్రోలు, గండేపల్లి, జగ్గంపేట, కిర్లంపూడి, పెదపూడి, సామర్లకోట, పెద్దాపురం, మండలాల్లో వచ్చే 5 రోజుల్లో 41 డిగ్రీల సెంటీగ్రేడ్ మించి ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసిందని ఆయన తెలిపారు. కావున అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల ప్రభావం నుండి రక్షణకు ప్రజలు అప్రమత్తతో ఉండి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ .... వేసవి ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల వేడి గాలుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. వడదెబ్బ నుండి రక్షణ పొందేం దుకు ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడగాడ్పుల వల్ల డిహైడ్రేషన్ కు గురికాకుండా నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీరు, మజ్జిగ, ఓఅర్ఎస్ వంటి ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. ఎండ వేళ సాద్యమైనంత వరకూ ఆరు బయట సంచరించవద్దని, బయటకి వెళ్లవలసినపుడు ఒదులుగా ఉండే తేలికపాటి, లేత రంగు కాటన్ దుస్తులు ధరించాలని, అలాగే టోపీలు, తలపాగలు, చలువ కళ్లజోళ్లు, గొడుగులు వాడాలని సూచించారు. తలనొప్పి, వాంతులు, విపరీతమైన అలసట, కండరాల తిమ్మిరి, అధిక హృదయ స్పందన రేటు, ముదురు రంగులో మూత్రం రావడం వంటివడదెబ్బ సూచనలు కలిగితే వెంటనే నీడలో లేదా చల్లటి ప్రదేశంలో పడుకోవాలని, తడి గుడ్డతో శరీరాన్ని తుడుస్తూ, చల్లని నీరు లేదా ఓ.ఆర్.ఎస్ తాగించాలని, పరిస్థితి విషమిస్తే వెంటనే సమీప ఆసుపత్రికి తరలించి వైద్యులను సంప్రదించాలని తెలిపారు.

# సాగునీటి సంఘాలదే కీలక బాధ్యత : మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



**సాలూరు, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, సాగునీటి వినియోగం, నీటి భద్రతలో సాగునీటి సంఘాలు క్రియాశీలక పాత్ర పోషించాలని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన "నీటి భద్రత -- సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, రైతులతో కలిసి సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈనెల 6నుంచి జూలై 14 వరకు వంద రోజుల పాటు ఈ ప్రత్యేక కార్యక్రమం కొనసాగుతుందని వెల్లడించారు. ఈ కాలంలో క్షేత్రస్థాయిలో సాగునీటి అవసరాలను గుర్తించడం, పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయడం, యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయడం లక్ష్యంగా పెట్టుకొని, సాగునీరు సకాలంలో రైతులకు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆమె ఆదేశించారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం ఈ ఏడాది రూ.490 కోట్లు కేటాయించిందని మంత్రి తెలిపారు. అనంతరం పిజిఆర్ఎస్ ద్వారా వచ్చే ప్రజా సమస్యలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా పరిష్కరించాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ ఆర్ వైశాలి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, మున్సిపల్, మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు, సాగునీటి సంఘాల ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు

**.నీటి నిల్వ సామర్థ్యం పెంచడమే : కలెక్టర్**

'జలధార' కార్యక్రమం ద్వారా రాబోయే వంద రోజుల్లో నిర్దిష్ట లక్ష్యాలతో నీటి సంరక్షణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎన్ ప్రభాకర రెడ్డి ఆదేశించారు. జలవనరుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన నీటి భద్రతా సాగునీటి సంఘ బాధ్యత వంద రోజుల కార్యక్రమానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ స్థాయిలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు క్రియాశీలక పాత్ర పోషిం చాలని, గ్రామంలో నీటి నిల్వను పెంచడానికి, వృథాను అరికట్ట డానికి ఉన్న అవకాశాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు. పాడైన చెరువు తూములు, పూడికతో నిండిన కాలువలను గుర్తించి వాటిని బాగు చేయడం, గతంలో ఉన్న ఆయకట్టును పునరుద్ధరించడమే కాకుండా, చెరువుల్లో పూడిక తీయడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచి అదనపు ఆయకట్టుకు నీరు అందించడమే ధ్యేయమని పేర్కొన్నారు. చెరువులు, కాలువల ఆక్రమణలను గుర్తించి, వాటిని తొలగించేలా గ్రామస్తులు సహకరించాలన్నారు. జిల్లాలో దాదాపు 2,900 చెరువులను గుర్తించి, వాటి చుట్టూ ఆక్రమణలు జరగకుండా ఉపాధి హామీ పథకం కింద ఫెన్సింగ్ వేయడం, చుట్టూ మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టనున్నామని, దీనివల్ల చెరువుల సరిహద్దులు స్పష్టంగా తెలియడమే కాకుండా పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని చెప్పారు. కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తూ, సాగునీటి వనరుల సమర్థ వినియోగమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'నీటి సంఘాల బాధ్యత' కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైందన్నారు.. ముఖ్యంగా చెరువుల పరిస్థితి, నీటి నిల్వ సామర్థ్యం, ఎండిపోయిన వనరులను పునరుద్ధరించడంపై దృష్టి సారించాలని సూచించారు. మేజర్, మైనర్ కాలువలతో పాటు చెక్ డ్యామ్‌ల మరమ్మతులపై కూడా ప్రత్యేక నివేదికలు అందించాలని కోరారు. పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర మాట్లాడుతూ జిల్లాలోని జల వనరులను పునరుద్ధరించడం, భూగర్భ జలమట్టాన్ని పెంచడమే లక్ష్యంగా 'వంద రోజులు - నీటి భద్రత' అనే వినూత్న కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, నీటి సంఘాల చైర్మన్లు, నీటిపారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి



**అమలాపురం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** అఖిలభారత అధ్యక్ష, కార్య దర్శులు, ఐదు రాష్ట్రాల అధ్యక్ష, కార్య దర్శులు, రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన నాయ కత్వం హాజరవుతున్న వ్యవసాయ కార్మిక సంఘం 30వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయా లని ఆహ్వాన సంఘం అధ్యక్షులు మాజీ ఎంఎల్సి ఇళ్ల వెంకటేశ్వరరావు ఐవి, ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు సివి.రామన్ విద్యాసంస్థలు ఛైర్మన్ రవణం వేణుగోపాల్ పిలుపు నిచ్చారు. మంగళవారం అమలాపురం సివి.రామన్ పాఠశాలలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభ కరపత్రం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐవి మాట్లాడుతూ మే 6, 7, 8 తేదీల్లో స్థానిక గడియార స్తంభం సెంటర్ గంగరాజు ఫంక్షన్ హాల్‌లో 30వ రాష్ట్ర వ్యవ సాయ కార్మిక సంఘం మహాసభ నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పేరును విబిజి ఆర్ఏఎంజిగా మార్చడం వెనక కేంద్రం లోని బిజెపి ప్రభు త్వం కుట్ర దాగి ఉందని అలాగే ఉపాధి హామీ చట్టం నిధులు తగ్గించడం దారుణ మని మాజీ ఎంఎ ల్‌సి ఐవి అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ కార్మికుల ఐక్యతను బలోపేతం చేయడం, వారి హక్కులను సాధించడం లక్ష్యంగా రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ జిల్లాలో నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు మాట్లాడుతూ ఈ మహాసభకు రాష్ట్రంలో వివిధ జిల్లాల నుంచి వేలాది మంది వ్యవసాయ కార్మి కుల హాజరవుతారన్నారు. కార్మికుల ఎదుర్కొం టున్న సమ స్యలైన కనీస వేతనాలు, సంవత్సర మంతా ఉపాధి కల్పించడం, గృహాలు, పింఛన్లు వంటి వ్యవసాయ కార్మికుల సంక్షేమంపై పెద్ద ఎత్తున పోరా టాలు చేయాలని పిలుపునిచ్చారు. వ్యవ సాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షులు రవణం వేణుగోపాల్, ఉపాధ్యక్షులు సుధా గణపతి, సప్పా నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కారెం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజులు పాటు జరిగే ఈ మహాసభకు వ్యవసాయ కార్మిక సంఘం అఖిలభారత నాయకత్వం బి. వెంకట్, విజయ రాఘవన్ తమిళనాడు, కేరళ , తెలంగాణ తదితర రాష్ట్రాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాష్ట్రంలోని 28 జిల్లాల నుంచి వ్యవ సాయ కార్మిక ఉద్యమ నాయకత్వం హాజరవు తారన్నారు. ఆతిథ్యం ఇవ్వాల్సిన బాధ్యత మనందరి పైన ఉందని మొదటి రోజు జరిగే భారీ బహిరంగ సభ ప్రదర్శన కూడా జయప్రదం చేయాలన్నారు. దీనికోసం జిల్లాలో ప్రము ఖులు మేధావులు, ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులు ప్రజాప్రతినిధులు వర్తక సంఘాలు ఈ రాష్ట్ర మహా సభకు ఆర్థిక, హార్థిక సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సకిలే సూర్య నారాయణ, సహాయ కార్యదర్శి ఇసుక పట్ల మంగా దేవి, సిఐటియూ అధ్యక్షులు జి.దుర్గాప్రసాద్ జిల్లా నాయకులు పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మార్చి నెల జీతం వెంటనే ఇవ్వాలి



**మన్యం జిల్లా, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** మార్చి నెల వేతనాలు నేటికీ మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులకు చెల్లించకపోవడం అన్యాయమని, వెంటనే వారి ఖాతాల్లోకి చెల్లించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణతో కలిసి మున్సిపల్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.రామారావుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వెంకటరమణ, మున్సిపల్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సింహాచలం, ఎన్.శంకరరావు మాట్లాడుతూ ప్రస్తుత ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కార్మికుని నెల జీతం చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం అన్యాయమని అన్నారు. వెంటనే వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. 60ఏళ్లకు రిటైర్ అయిన కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని, చనిపోయిన కార్మికుని కుటుంబాలకు ఉద్యోగాలు కల్పించాలని, 62 ఏళ్లకు రిటైర్మెంట్ వయస్సు పెంపు, చని పోయిన కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలని, పిఆర్సి, కార్మికుల జీతాలు పెంచాలని, ప్రభుత్వమే నేరుగా కార్మికులకు జీతాలు చెల్లించాలని, పట్టణ విస్తరణను గుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని, కార్మికుల పనిముట్లను వాహనాలను మరమ్మతులు చేపట్టాలని, పర్మినెంట్ కార్మికులకు రెండేళ్లు కుట్టుకూలి డబ్బులివ్వాలని, పారిశుధ్య పని నిమిత్తం శంబర యాత్రకు వెళ్లిన కార్మికులకు ఇవ్వాల్సిన డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతా మని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు రాజశేఖర్, పి.వరదరాజు, బి.రవి, యం.శివ, గంగేలు, గుంపుస్వామి, శారద, లక్ష్మీ, పాపమ్మ, సుజాత, ఇప్పలమ్మ తదితరులు పాల్గొన్నారు.

**సాలూరు :** మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడ రేషన్ సాలూరు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు టి.శంకరరావు, టి.రవి మాట్లాడుతూ ప్రభు త్వం ముందు చూపు లేకుండా మున్సిపల్ కార్మికుల జీతాల చెల్లింపులకు సంబంధించి కొత్త విధానాలు తీసుకువస్తుందని, అందువల్లే మార్చి నెల జీతాలు నేటికీ బిల్లులు పెట్టని పరిస్థితి నెలకొందన్నారు. కాంట్రాక్టు కార్మికులకు రాష్ట్రంలో అనేక మున్సిపాలిటీల్లో నిధులు లేకపోవడంతో జీతాల కొరత ఉందని, ఈ విషయాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి దృష్టిలో యూనియన్లు ఇప్పటికే పెట్టినా స్పందనలేదని ఆందోళన వ్యక్తం చేశారు.

# అంబేద్కర్ జయంతిని విజయవంతం చేయాలి



**అమలాపురం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** స్థానిక పేరూరు వై జంక్షన్ సెంటర్‌లో ఎస్సి, ఎస్టి, బిసి, ఒసి మైనారిటీ, మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఏప్రిల్ 14 సాయంత్రం 7 గంటలకు నిర్వహించే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 135వ జయంతి కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని పలువురు నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముఖ్యనాయకులు మాట్లాడుతూ అంబేద్కర్ అందరి వాడన్నారు. ఆయన త్యాగం తో ఏర్పడిన భారత రాజ్యాంగం అన్ని వర్గాలకు, అన్ని వ్యవస్థలకు రక్షణ కల్పిస్తుందన్నారు. కాబట్టి కుల, మత, ప్రాంతీయ విభేదాలు లేకుండా అందరూ కలిసి అంబేద్కర్ జయంతి నిర్వహించడం మనందరి బాధ్యత అని అన్నారు. కార్యక్రమంలో డిబి.లోక్, ఎంఎకె. భీమారావు, కొత్తూరి శ్రీనివాస్, షేక్ ఖాదర్, అరవ చంటి, సంసాని వెంకట రత్నకుమార్, అయితాబత్తుల సుభాషిణి, పెయ్యల పరశు రాముడు, పెయ్యల శ్రీనివాసరావు, ఎండి. షకీలా, జల్లి శ్రీనివాసరావు, నక్కా సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# 194 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**ఆత్రేయపురం, ఏప్రిల్ 07 (నేటి మనదేశమ్) :** ల్లరైతు కష్టానికి సరైన ప్రతిఫలం అందాలనే ఆశయంతో జిల్లాలో 194 ధాన్యం కొను గోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ తెలిపారు. ఆత్రేయ పురంలో ఎంఎల్ఎ బండారు సత్యానంద రావుతో కలిసి ఆయన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రప్రథమంగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రైతుల కష్టానికి సరైన ప్రతిఫలం అందాలనే ఆశ యంతో ప్రభుత్వం ఈ సౌలభ్యం కల్పించిం దన్నారు. గతం లో రైతులు పండించిన పంటను అమ్ముకోవడానికి దళారులపై ఆధారపడి మోసపోయేవారని, ప్రస్తుతం నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మద్దతు ధర పొందే అవకాశం కలిగిందన్నారు. మద్దతు ధరకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర నేరుగా రైతు ఖాతాల్లోకే 24 గంటలలోపే జమ అవుతుం దన్నారు. దీనివల్ల ప్రతి గింజకూ తగిన విలువ దక్కుతుందన్నారు. ఈ కేంద్రాల్లో ధాన్యం సేకరణకు అవసరమైన తేమ యంత్రాలు, తూకం మిషన్లు, గన్నీ బ్యాగులను సిద్ధం చేశా మన్నారు. ఎంఎల్ఎ బండారు సత్యానందరావు మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రైతు శ్రేయస్సుకు పెద్దపీట వేస్తోందన్నారు. కోనసీమలో పండే ప్రతి వరి గింజ రైతుకు లాభాన్ని చేకూర్చాలనీ ఆకాం క్షించారు. ఎపి సివిల్ సప్లయి కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్ మాట్లాడుతూ పౌర సరఫరాల శాఖ ధాన్యం కొనుగోలుకు పార దర్శక విధానాలను అవలంభిస్తుందన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు సంబంధించి ఎటువంటి అసంతృప్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డి.లక్ష్మీనారాయణ, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ పి.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.ఉదయ భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి రామారావు, స్థానిక ప్రజా ప్రతినిధులు, నీటి సంఘాల అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. అనంతరం లొల్ల లాకుల వద్ద 100 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమాన్ని ఎంఎల్ఎతోపాటు, కలెక్టర్ ప్రారంభించారు.

# ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్‌లు పంపిణీ



**విజయనగరం, ఏప్రిల్ 07 (నేటి మన దేశమ్) :** వేసవిలో తీవ్ర ఎండల దృష్ట్యా ఉపశమనం పొందడానికి సుమారు రూ.1లక్ష విలువైన హ్యాట్స్, వాటర్ బాటిల్, బ్యాగుతో కూడిన సమ్మర్ కిట్‌లను ట్రాఫిక్ పోలీసు స్టేషనులో పని చేసే, ఎఎస్ఐలు, హెచ్‌సిలు, కానిస్టేబుళ్లకు ఎస్పి ఎఆర్ దామోదర్ సోమవారం అందజేశారు. పోలీసు సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే వేళలను మినహాయించి, ట్రాఫిక్ విధులు నిర్వహించే పోలీసు సిబ్బంది పని గంటలను మార్పులు చేయాలని ట్రాఫిక్ సిఐని ఆదేశించారు. ప్రజలకు నిరంతరం సేవలందించడంతో పాటు, రోగ్యంపై కూడా ప్రత్యేకంగా శ్రద్ధ పెట్టాలని, తరుచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వేసవిలో ఎండ తీవ్రతను ఎదుర్కొనేందుకు, డీహైడ్రేషన్ కు గురికాకుండా తరుచూ మంచి నీళ్ళు, మజ్జిగ, ఒఆర్ఎస్, గ్లూకోజ్ తాగాలని తెలిపారు. ట్రాఫిక్ సిగల్ పాయింట్స్ వద్ద వాహనదారులు ఎక్కువ సమయం ఎండలో వేచి ఉండకుండా సిగల్ టైమింగ్స్ తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ సిఐకి సూచించారు. కార్యక్రమంలో డిఎస్పి ఆర్.గోవిందరావు, ట్రాఫిక్ సిఐ సూరి నాయుడు, ఎస్బి సిఐ ఎవి లీలారావు, ట్రాఫిక్ ఎస్ఐలు ఎస్.భాస్కరరావు, చిన్నారావు పాల్గొన్నారు.

# బంగారానికి ఆశపడి .. వృద్ధురాలిని చంపిన బంధువులు



**చీపురుపల్లి (విజయనగరం) :** చెరువులో పాతిపెట్టిన ఘటన పోలీసుల దర్యాప్తులో వెలుగు చూసింది. మంగళవారం స్థానిక వివరాల మేరకు ... చీపురుపల్లి మండలం గొల్లపాలెం గ్రామంలో గొర్లె చిన్నప్పమ్మ (65) ను అదే గ్రామానికి చెందిన ఆమె మేనల్లుడు వరుసైన ఎజ్జుపొరపు రమణ, చందక రమణ అనే ఇద్దరు వ్యక్తులు కలిసి ఆమె బంగారానికి ఆశపడి చంపేసినట్లు స్థానికులు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23వ తేదీన వఅద్ధురాలిని గొల్లపాలెం గ్రామానికి సమీపంలో గల ఒక చెరువులో పాతిపెట్టారు. దీంతో మృతురాలి అల్లుడు రెడ్డి పాపునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసును ఛేదించారు.

# మధ్యవర్తులను నమ్మవద్దు

- ప్రజల సమస్యలకు నేరుగా పరిష్కారం..
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్):** ప్రజల సమస్యల పరిష్కారానికి ఎటువంటి మధ్యవర్తులు అవసరం లేదని జిల్లా కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలకు సేవలు అందించే పేరుతో కొంతమంది మధ్యవర్తులు మోసాలకు పాల్పడుతున్నట్లు గమనించామని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కొందరు వ్యక్తులు భూ భారతి సమస్యలు పరిష్కరిస్తామని, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు వంటి ప్రభుత్వ పథకాలలో ఎంపిక చేస్తామని చెప్పి డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఇలాంటి వ్యక్తులకు ఎటువంటి అధికారిక గుర్తింపు లేదని, వారు ప్రజలను మోసం చేస్తున్నారని స్పష్టం చేశారు. ఎవరైనా సమస్య పరిష్కారం పేరుతో డబ్బులు డిమాండ్ చేస్తే ఒక్క పైసా కూడా ఇవ్వవద్దని ప్రజలకు సూచించారు. అలాంటి ఘటనలు ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని కోరారు. ప్రజలు తమ సమస్యలను ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా జిల్లా కలెక్టర్ లేదా ఉన్నతాధికారులకు తెలియజేయవచ్చని తెలిపారు. అలాగే బుధవారం నుండి శుక్రవారం వరకు మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జిల్లా కలెక్టర్ ప్రజలను కలుసుకునే అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ సమయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మధ్యవర్తులను నమ్మి డబ్బులు కోల్పోకుండా జాగ్రత్తగా ఉండాలని జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

# ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి.ఎమ్మెల్యే పాయల్ శంకర్




**ఆదిలాబాద్ ఏప్రిల్ 07 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** మంగళవారం రోజు ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.ఆరోగ్యం మనిషి జీవితంలో అత్యంత ముఖ్యమైనదని,ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన పేర్కొన్నారు.భారతదేశం ప్రపంచానికి అందించిన యోగా మరియు ధ్యానం యొక్క ప్రాముఖ్యతను ఆయన వివరించారు.ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కృషితో ప్రపంచ దినోత్సవం ఆఫ్ యోగ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందని తెలిపారు.యోగా ద్వారా శారీరక,మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని,ప్రతి ఒక్కరూ దాన్ని తమ జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు.ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ప్రస్తావించారు.సరైన ఆహారం,వ్యాయామం,పరిశుభ్రత వంటి అంశాలు మన ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలకమని తెలిపారు.అలాగే,కొంతమంది వ్యాపార సంస్థలు లాభాల కోసం ప్రజలు అనారోగ్యంగా ఉండే పరిస్థితులను ప్రోత్సహిస్తున్నాయని,అలాంటి ప్రభావాలకు లోనుకాకుండా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం కృషి చేయాలని,యోగా,వ్యాయామం,సమతుల ఆహారం ద్వారా మంచి ఆరోగ్యాన్ని సాధించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.సమాజం ఆరోగ్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.కార్యక్రమంలో ఎంపీ గోడం నగేష్ ,మున్సిపాల్ చైర్ పర్సన్ బండారి అనూష ,జిల్లా కలెక్టర్ రాజర్షి షా,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్,రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్,అధికారులు,విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మేధావులకు ల్యాప్‌టాప్‌ల బహూకరణ



**మల్కాజిగిరి, ఏప్రిల్ 7 (నేటి మనదేశమ్):** మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బరాబరీ కలెక్టివ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన ఆరుగురు విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు బహూకరించారు. గత మూడు నెలలుగా నిర్వహించిన ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లో ఉత్తమ ప్రదర్శన కనబర్చిన విద్యార్థులను గుర్తించి ఈ బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బండి రాజు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు లభించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. క్రమశిక్షణ, కృషి, పట్టుదలతో ముందుకు సాగి రానున్న తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. సాంకేతిక నైపుణ్యాలతో పాటు నైతిక విలువలు కూడా సమానంగా అవసరమని పేర్కొన్నారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు ప్రభుత్వ కళాశాల విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసి అన్ని రంగాల్లో రాణించేందుకు దోహదపడతాయని ఆయన అన్నారు.బరాబరీ కలెక్టివ్ కోఆర్డినేటర్ లక్ష్మీ సింధూర మాట్లాడుతూ, విద్యార్థులు ప్రదర్శించిన ప్రతిభ అభినందనీయమని పేర్కొన్నారు. శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలు భవిష్యత్తులో మెరుగైన అవకాశాలకు దారి తీస్తాయని తెలిపారు. విద్యార్థుల అభివృద్ధికి బరాబరీ కలెక్టివ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు.కళాశాల ప్లేస్మెంట్ సెల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్. రాజేశ్ కుమార్ మాట్లాడుతూ, ఈ శిక్షణా కార్యక్రమం విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలపై అవగాహన పెంచిందని తెలిపారు. ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు.ల్యాప్‌టాప్‌లు అందుకున్న విద్యార్థులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ, మరింత కృషి చేసి ఉన్నత స్థానాలను అధిరోహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, అకడమిక్ కోఆర్డినేటర్ గుణాకర్, డాక్టర్ బ్రిజేష్, డాక్టర్ మల్లికతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజేతలను అభినందించారు.

# బోసిపోయిన వార్డ్ సభ్యుల శిక్షణా తరగతులు

వివరణ కోరగా నిరాకరించి, ముఖం చాటేసిన బుగ్గారం ఎంపిడివో "వాసవి"





**జగిత్యాల/బుగ్గిపాలు, ఏప్రిల్ 07(నేటి మన దేశమ్ ప్రతినిధి)::** జిల్లాలోని బుగ్గారం మండలం శేఖల్ల గ్రామంలోని రైతు వేదికలో నిబంధనలకు విరుద్ధంగా, ఉన్నతాధికారుల షెడ్యూల్ , ఆదేశాల భే ఖాతర్ తో గత రెండు రోజులుగా కొనసాగుతున్న వార్డ్ సభ్యుల శిక్షణా తరగతులు సరైన సంఖ్యలో సభ్యులు హాజరు కాక బోసిపోయాయి.ఈ శిక్షణా తరగతుల నిర్వహణ వివాదాస్పదంగా మారి జిల్లా కలెక్టర్ ప్రజా వాణిలో పిర్యాదుల వరకు వెళ్ళడం జరిగింది. మంగళ వారం పలువురు పాత్రికేయుల బృందం ఈ శిక్షణా తరగతులను సందర్శించడం జరిగింది. మండలంలోని 10 గ్రామాలకు చెందిన 96 మంది వార్డ్ సభ్యులకు గాను కేవలం 26 మంది మాత్రమే శిక్షణా తరగతులలో ఆసీనులయ్యారు. అందులో కొందరు మహిళా వార్డ్ సభ్యుల కోసం వచ్చిన వారి భర్తలు, కుటుంబ సభ్యులు, ఇతరులు కూడా ఉన్నారు. ఇంత తక్కువ సంఖ్యలో సభ్యులు హాజరు అయ్యారేంటి అని ఆరా తీయగా మండల కేంద్రంలో కాకుండా ఎలాంటి రవాణా సౌకర్యం లేని, బస్సులు లేని, మారుమూల ప్రాంతంలో శిక్షణా తరగతులు నిర్వహించడమే అధికారుల తప్పిదం అని తెలుస్తోంది.పలువురు వార్డ్ సభ్యులతో విలేఖరులు ప్రస్తావించగాపంచాయతీ కార్యదర్శులు, కారోబార్ లో పదే – పదే ఫోన్ కాల్స్ చేసి కనీసం వచ్చి హాజరు వేసుకొని పోవాలని విసిగించగా అంత దూరం వెళ్ళడం ఇష్టం లేకున్నా వారి బాధలు భరించలేక హాజరు కోసం అలా వెళ్ళి ముఖం చూపెట్టి ఇలా రావడం జరుగుతుందన్నారుఈ రూట్ లో బస్సు సౌకర్యం లేక ప్రత్యేకంగా ఆటో కిరాయికి మాట్లాడుకొని ఆర్థిక భారం భరిస్తూ శిక్షణా తరగతులకు హాజరయ్యామని కొంత మంది ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షణా తరగతుల విషయమై బుగ్గారం మండల అభివృద్ధి అధికారిణి "వాసవి" ని మీడియాతో మాట్లాడాలని కోరగా నిరాకరించి, నిన్ననే ప్రెస్ నోట్ పంపాను అంటూ నిరాకరించారు. మండల కేంద్రంలో కాకుండా శేఖల్ల లో శిక్షణా తరగతులు ఎందుకు నిర్వహించాల్సి వచ్చిందని వివరణ కోరగా ముఖం చాటేసుకొని వెళ్ళారు.ఒక మండల స్థాయి అధికారిణిగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ప్రాథమిక పాఠశాలలో, రైతు వేదికలో వసతులు లేవని "అక్బర్" అనే ఒక పంచాయతీ కార్యదర్శి నంబర్ నుండి పాత్రికేయుల వేదిక గ్రూప్ లో "ఎంపిడివో" ప్రెస్ నోట్ జారీ చేయించడం పలు వివాదాలకు దారి తీస్తోంది. అధికారుల, పాలకుల, ప్రభుత్వాల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. దీనితో అధికార పక్షం మండిపడుతుండగా, ప్రతి పక్షాలూ ప్రభుత్వం పై, అధికారులపై, పాలకులపై పలు రకాల విమర్శలు చేస్తున్నారు.అన్ని రకాల వసతులు ఉన్నాయని చెప్పి శేఖల్ల రైతు వేదికలో శిక్షణా తరగతులు నిర్వహించిన మండల అధికారులు అక్కడ భోజనాలకు, గుట్ట బోరు వద్ద ఎండ వేడితో పార్కింగ్ లకు టెంట్లు ఎందుకు వేయాల్సి వచ్చిందని పలువురు వార్డ్ సభ్యులు ప్రశ్నిస్తున్నారు. ఇదంతా ప్రభుత్వం ద్వారా వృధా ఖర్చులు చేయడానికేనని, ఖజానాకు భారీగా గండి కొట్టేందుకేనని ఆరోపిస్తూ పలువురు వార్డ్ సభ్యులు ముక్కున వేలేసుకుంటున్నారు.ఇప్పటికైనా ఉన్నతాధికారులు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఇలాంటి అధికారుల పై చట్టపరమైన, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని బుగ్గారం మండల ప్రజలు కోరుతున్నారు.

# జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కు నాలుగు అవార్డులు

జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి. సుజాత





**జగిత్యాల, ఏప్రిల్ 07(నేటి మన దేశమ్ ప్రతినిధి)::** జగిత్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కు నాలుగు అవార్డులు వచ్చినట్లు జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి. సుజాత తెలిపారు.ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర వైద్య శాఖ లో వివిధ విభాగాల్లో ఉత్తమ వైద్య సేవలందించిన ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రతిభ కనబరిచిన వైద్యులకు, ఆరోగ్య కేంద్రాలకు అవార్డులకు ఎంపిక చేశారు. ఈమేరకు మంగళవారం రవీంద్రభారతిలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా అవార్డులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి సుజాత,జిల్లా ప్రోగ్రాం అధికారి టీబీ, లెప్రసీ మరియు ఎయిడ్స్ డాక్టర్ ఏన్ శ్రీనివాస్ తో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఎయిడ్స్ నియంత్రణ కేంద్రం అంటి రెట్రో వైరల్ తెరపి సెంటర్ (ఎంఆర్ టీ), రాయికల్ బస్తీ దావఖానకు, తారక రామ్ నగర్ బస్తి దావఖానకు తోపాటు పొలాస ఉప కేంద్రం నుండి ఏఎన్ఎం కు అవార్డులు రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు రావడానికి కృషి చేసిన ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎన్ శ్రీనివాసు,సీనియర్ వైద్యాధికారి డాక్టర్ శ్రావణి, డాక్టర్ శిరీష, కౌన్సిలర్ లు రాజు, రజని, డిఈవో అనీల్, సిబ్బంది లను అభినందించారు.

# పమిడి పడగ రాజు, సడలమ్మ జాతర పోస్టర్ ఆవిష్కరణ



**ములుగు, ఏప్రిల్:7(నేటిమన దేశమ్ ప్రతినిధి)** ములుగు జిల్లా గోవిందరావు పేట్ మండలం, పస్రా గ్రామం లో ఏప్రిల్ 22,23,24.తేదీల్లో నిర్వహించే పమిడి పడగ రాజు, సడలమ్మ పెద్ద వేల్పు జాతర ను విజయవంతం చేయడం కోసం జాతర పోస్టర్ ను ఆవిష్కరణ చేయడం జరిగినది,అనంతరం తల్పతులు రాకేష్ కొమ్మలు, రామయ్య మంకిడి రవి, మంకిడి నర్సింగరావు, నర్సింహాస్వామి, ప్రశాంత్, బుచ్చిరామయ్య, పోతరాజు, రాజబాబు, నరేష్ ప్రేమ్ కుమార్, మంకిడి సమ్మయ్య,ఆగబోయిన రవి, వడ్డే దారం సమ్మయ్య ల మాట్లాడుతూ 22వ తేదీ మొదటి రోజున, ఒక్కపొద్దు గుడి శుభ్ర పరుచుట 23 వ తేదీన దుబ్బ పానుపు తెచ్చుట అనంతరం రాత్రి తెల్లవార్లూ జాగర పట్టుట 24వ తేదీన తెల్ల వారు సమయం లో హారానికి వెళుట దేవుళ్ళకు నైవేద్యం పెట్టి జాతర ముగించటం జరుగుతుందని తెలియజేశారు,ఇట్టి జాతర కు వచ్చు ఇంటి పేర్లు గల వారు మంకిడి, ధనుసరి, దుగ్గరాపు,దుగ్గి, బత్తుల,జబ్బ, ఎదుల్లపల్లి, ఊకె, ఆగబోయిన, కోలా, ఐలబోయిన, రేటా,భూపతి,ఈ ఇంటి పేర్లు గలవారు ఈ పెద్ద వేల్పు జాతరకు వస్తారని తెలియచేశారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవ సందర్భంగా భారీ ర్యాలీ







**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఏప్రిల్ 7: బూర్గంపహాడ్ (నేటి మన దేశమ్ ప్రతినిధి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం మొరంపల్లి బంజర్ లో ఉన్నటువంటి పీ హెచ్ సి వైద్య అధికారి జె నగేష్ ఆధ్వర్యంలో కేజీవీబీ పాఠశాల నందు పాఠశాల విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ బి తుకారం రాథోడ్ హాజరై ప్రపంచ ఆరోగ్య దినోత్సవ అవశ్యకతను వివరించడం జరిగింది. ఆరోగ్యమే మహాభాగ్యం ప్రతి ఒక్కరు వ్యక్తిగత ఆరోగ్యం పై శ్రద్ధ వహించాలని పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చేతులు శుభ్రంగా ఉంచుకోవడం వలన 90 శాతం జబ్బులను నరకట్టుకో వచ్చని ఇంటి ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యం చాలా బాగుంటుంది అని బయటి ఆహారం ప్రతిదీ కల్తీ అయి మన ఆరోగ్యం పై ప్రభావం చూపుతుందని పెద్దలు పిల్లలు బయటి ఆహారాన్ని దూరంగా ఉంచడం మంచిదని అన్నారు ఈ కార్యక్రమంలో కేజీవీబీ వార్డెన్ ఎం సుశీల పాఠశాల ఉపాధ్యాయులు డిపిఎమ్ఓ మోహన్, హెచ్ఈఓ బి రవి, హెచ్ వి, వెంకట్ నర్సమ్మ, మరియు ఏఎన్ఎంఎస్ లు, ఆశలు పాల్గొనడం జరిగింది

# గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ వైద్య సేవలకు రాష్ట్ర స్థాయి గుర్తింపు.


భద్రాద్రి కొత్తగూడెం టీవీవీపీ ఆసుపత్రులకు అత్యధిక అవార్డులు.






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 07,( నేటి మనదేశమ్),** 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళి కలో భాగంగా నిర్వహిం చిన ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రకటించిన అవార్డుల్లో గిరిజన జిల్లా భద్రాద్రి కొత్తగూడెం విశిష్ట స్థానం సంపాదించింది. జిల్లా డీసీహెచ్ఎస్ డా. రవి బాబు పరిధిలోని వైద్య విధాన పరిషత్( టి వి వి పి ) ఆసుపత్రులు అత్యధిక అవార్డులు సాధించడం విశేషం.గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు నాణ్యమైన, సమయోచిత వైద్య సేవలు అందించడంలో చూపిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులు లభించాయి. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఈ రోజు అవార్డుల ప్రదానం హైదరాబాద్ లోని రవీంద్రభారతి లో జరిగింది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యదర్శి శ్రీమతి క్రిస్టినా, కమిషనర్ ఫ్యామిలీ ఽ హెల్త్ శ్రీమతి సంగీత, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్ , హైదరాబాద్ జిల్లా కలెక్టర్ మరియు ఆరోగ్య శాఖకు సంబంధించిన పలు విభాగాధిపతులు పాల్గొన్నారు.ఈ అవార్డులు అందుకున్న వారిలో సి హెచ్ సీ పాల్వంచకు చెందిన డా. శైలేష్ కుమార్ ( సి ఏ ఎస్ –ఆర్థో), డా. పి. రామ్ ప్రసాద్ ( డివైసిఎస్ –అనస్తీషియా), ఏరియా హాస్పిటల్ భద్రాచలం నుంచి డా. క్రపా విజయ్ (డివైసిఎస్–పెడియాట్రిక్స్), నర్సింగ్ ఆఫీసర్ శ్రీమతి కృష్ణవేణి, ఏ బి ఏ ఎస్ సేవలలో ఎ. వెంకట రావు (98%), అలాగే ల్యాబ్ సేవల విభాగంలో భద్రాచలం మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ కృష్ణ ఉన్నారు. ఏరియా హాస్పిటల్ మనుగూరు నుంచి నర్సింగ్ ఆఫీసర్ శ్రీమతి మానస , సీఎంఎస్ ఇంచార్జ్ ఫార్మాసిస్ట్ గ్రేడ్––× ఏ. శారధ అవార్డులు అందుకున్నారు. అదనంగా భద్రాచలం, మనుగూరు, చర్ల వంటి గిరిజన ప్రాంతాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు "బెస్ట్ పెర్ఫార్మెన్స్ ఇన్ ట్రైబల్ ఏరియా" విభాగంలో డీ సి హెచ్ ఎస్ డాక్టర్ జి రవి బాబు మూడు అవార్డులు ఆయా సూపరింటెండెంట్లు అయిన రామ కృష్ణ,గౌరీప్రసాద్, సాయి వర్ధన్ లతో కలిసి అందుకున్నారు..జిల్లా టీవీవీపీ ఆసుపత్రులు ఇప్పటికే పలు సందర్భాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు పొందగా, ఈ అవార్డులు గిరిజన ప్రజలకు అందిస్తున్న ఉత్తమ వైద్య సేవలకు మరో గొప్ప గుర్తింపుగా నిలిచాయి

# పది పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ రాజర్షి షా



**అదిలాబాద్ ఏప్రిల్ 07 (నేటి మన దేశమ్ ప్రతినిధి.** పట్టణంలోని వినాయక్ చౌక్ బాలక్ మందిర్ పాఠశాలలోని పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించిన ఆయన,కేంద్రంలోని వసతులపై సంతృప్తి వ్యక్తం చేశారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని,నిబంధనల ప్రకారం పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ తహసిల్దార్ శ్రీనివాస్,ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందం అధికారులు ఉదయ్ రావు,ప్రేమ్ నివాస్,చీఫ్ సూపరింటెండెంట్ సారా ఖాతూన్,రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ యాజ్వేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రంప్ పోస్ట్‌పై ఆందోళన వ్యక్తం చేసిన యుఎన్ చీఫ్




యుఎన్ : ఇరాన్ విద్యుత్ కేంద్రాలపై దాడులకు దిగుతామంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పోస్ట్‌పై ఐక్యరాజ్యసమితి చీఫ్ ఆంటోనియో గుటెరస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, బ్రిడ్జీలు సహా ఇతర మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తామన్న ట్రంప్ బెదిరింపులకు దిగిన సంగతి తెలిసిందే. ట్రంప్ సోషల్‌మీడియా పోస్ట్ తమను ఆందోళనకు గురిచేసిందని సోమవారం మీడియా అడిగిన ప్రశ్నకు ఆంటోనియా గుటెరస్ ప్రతినిధి స్టెఫాన్ దుజారిక్ తెలిపారు. అంతర్జాతీయ చట్టానికి సంబంధించిన అంశాలపై గుటెరస్ స్పష్టంగా ఉన్నారని, ఈ ఘర్షణల నిర్వహణకు తమ బాధ్యతలను పాటించాలని అన్ని పక్షాలన కోరుతున్నారని అన్నారు. దేశ మౌలిక సదుపాయాల లక్ష్యంగా దాడులు చేపట్టడం అంతర్జాతీయ మానవతా చట్టాన్ని ఉల్లంఘించడమే నని గుటెరస్ గుర్తు చేశారని అన్నారు. అంతర్జాతీయ వివాదాల శాంతియుత పరిష్కారానికి ఆచరణీయమైన ప్రత్యామ్నాయం లేనందున యుద్ధాన్ని ఆపడానికి ఇదే సరైన సమయమని ఆయన పునరుద్ఘాటించారని అన్నారు. ఇటువంటి దాడులను యుద్ధ నేరా లుగా పరిగణించబడతాయా అన్న మీడియా ప్రశ్నకు ఆయన సమాధానాన్ని దాట వేశారు. అవి అంత ర్జాతీయ చట్టాల ఉల్లంఘన అవు తుందని, ఒక విషయం నేరమా కాదా అనేది న్యాయస్థానం నిర్ణయిం చాల్సి వుంటుందని అన్నారు. పౌర మౌలిక సదుపాయాలపై దాడులు అంత ర్జాతీయ చట్టాల ఉల్లంఘననని దుజారిక్ అన్నారు.

## కోమాలో ఉన్న ఇరాన్ కొత్త సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ




లండన్ : ఇరాన్ కొత్త సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ తీవ్ర ఆనారోగ్యం పాలయ్యారు. ఆయన అపస్మారక స్థితిలోకి పోవడంతో ఇరాన్‌లోని ఖోమ్ నగరంలో ఓ ఆసుపత్రిలో చికిత్సనందిస్తున్నారు. ఇంటెలిజెన్స్ అంచనా ప్రకారం ఈ విషయాన్ని మంగళవారం లండన్ మీడియా ది టైమ్స్ యుకే నివేదించింది. కాగా, సుప్రీం నేత ఖమేనీ అపస్మారక స్థితిలో ఉన్నారని, తీవ్రమైన అనారోగ్యానికి చికిత్స పొందుతున్నారని అమెరికా- ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్ తన మిత్ర దేశాలకు సమాచారం అందించిందని యుకె మీడియా వెల్లడించింది. సర్వోన్నత నేత ఆచూకీని తొలిసారి వెల్లడించిన ఆ మెమోను తాము చూశామని టైమ్స్ పత్రిక వెల్లడించింది.

## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్ 2..
# భూమి నుంచి రికార్డు దూరంలోకి



అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలు గురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం. ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసు కోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలో మీటర్లు దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్‌మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళ్లుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చు.

# పవన్ ఖేడా ఇంటికి అస్సాం పోలీసులు



అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సతీమణికి 3 దేశాల పాస్‌పోర్టులు ఉన్నాయని, దీంతోపాటు ఆమె ఆస్తులను ఆయన అఫిడవిట్‌లో వెల్లడించకుండా దాచి పెట్టారని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో హిమంత సతీమణి రిణికి భూయాన్, పవన్ ఖేడాపై కేసు పెట్టారు. దీంతో అస్సాం పోలీసుల బృందం నేడు దిల్లీలోని ఆయన నివాసానికి వెళ్లారు. వారు ఆయనను అదుపులోకి తీసుకొని విచారించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు పవన్ ఖేడా నివాసానికి వెళ్లేటప్పటికి ఆయన అక్కడ లేకపోవడంతో.. వారు ఆయనకోసం ఎదురు చూస్తున్నారని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. పవన్ ఖేడా తనపై తప్పుడు ఆరోపణలు చేశారని హిమంత సతీమణి రిణికి భూయాన్ ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత్ ఎటువంటి ద్వంద్వ పౌరసత్వాన్ని అనుమతిం చదని.. కానీ తనకు మూడు పాస్‌పోర్ట్‌లు ఉన్నాయని కాంగ్రెస్ నేత నిరాధార ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. త్వరలో ఎన్నికలు జరగనున్న సమయంలో తమ కుటుంబాన్ని అప్రతిష్టపాలు చేసేందుకే కాంగ్రెస్ నేతలు ఇలా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆమె ఆరోపించారు.

# మాలోనే ఒక గూఢచారి : ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమ ప్రభుత్వంలో ఒక గూఢచారి ఉన్నారని పేర్కొన్నారు. ఇరాన్‌లో కూలిపోయిన ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ పైలట్‌ను కాపాడేందుకు యూఎస్ సైన్యం భారీ ఆపరేషన్ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఆపరేషన్ వివరాలను గుర్తు తెలియని వ్యక్తి (గూఢచారి) లీక్ చేశారని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు. యూఎస్ సైన్యం నిర్వహించిన ఆపరేషన్ గురించి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఎఫ్-15ఈ విమానం కూలిన తర్వాత ఒక పైలట్‌ను అమెరికా బలగాలు రక్షించాయన్నారు. అయితే, రెండో పైలట్ కోసం బలగాలు ఇంకా గాలిస్తున్నాయని ఓ వార్తాసంస్థ రాసిన కథనంతో ఇరాన్‌కు ఆ విషయం తెలిసిందన్నారు. దీంతో ఆపరేషన్ క్లిష్టతరమైందన్నారు. ఈ వార్త రాసిన జర్నలిస్టుకు ఆ సమాచారం ఎక్కడినుంచి వచ్చిందో వెల్లడించాలన్నారు. లేదంటే చట్టపరమైన పరిణామాలు ఎదుర్కోవాల్సివస్తుందని హెచ్చరించారు. సమాచారం ఎవరిచ్చారో జర్నలిస్టు చెప్పకపోతే.. జైలుకి వెళ్లాల్సివస్తుందని బెదిరిం చారు. అయితే, ఆ జర్నలిస్టు పేరు గానీ.. ఆ వార్త సంస్థ పేరు గానీ ట్రంప్ బయటపెట్టలేదు. లీక్‌కు కారణమైన వ్యక్తిని కనిపెట్టేందుకు తమ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తుందన్నారు. వారు తమలోనే ఉన్నారని పేర్కొన్నారు. అమెరికా దళాలు రెండో పైలట్ కోసం గాలిస్తున్నాయని వార్త ప్రచురితమైన తర్వాతే.. ఇరాన్ అప్రమత్తమైందన్నారు. ఆ పైలట్‌ను పట్టుకున్నవారికి భారీగా బహుమతి అందజేస్తామని ఆ దేశం బహిరంగ ప్రకటన జారీ చేసిందన్నారు. దీంతో తమ సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడిందన్నారు. గూఢచర్యానికి పాల్పడిన వ్యక్తిని మానసిక రోగిగా ట్రంప్ అభివర్ణించారు. అతడిని కనిపెట్టితీరాలని.. ఇది జాతీయ భద్రతకు సంబంధించిన విషయమని ట్రంప్ పేర్కొన్నారు.

**ఆపరేషన్‌లో 155 విమానాలు.. :** ఎఫ్-15ఈ పైలట్‌ను రక్షించేందుకు నిర్వహించిన ఆపరేషన్ వివరాలను ట్రంప్ వెల్లడించారు. 155 విమానాలు ఇందులో పాల్గొన్నాయన్నారు. వీటిల్లో నాలుగు బాంబర్లు, 64 ఫైటర్లు, 48 రీఫ్యూయలింగ్ విమానాలు, 13 రెస్క్యూ విమానాలు కూడా ఉన్నట్లు పేర్కొన్నారు.

# గాజాలో 8 వేల మందికిపైగా చిన్నారులు గల్లంతు



గాజా : 2023 అక్టోబర్ 7న ప్రారంభమైన పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులు ఇప్పటికీ కొనసాగుతూనే ఉన్నాయి. ఈ దాడుల వల్ల లక్షలాది మంది మరణించారు. 29 నెలలపాటు జరిగిన ఇజ్రాయిల్ దాడుల వల్ల గాజాలో 21,510 మంది మృతి చెందారు. ఇప్పటికీ 8 వేల మంది చిన్నారులు ఆచూకీ లేరు. బాంబుల దాడికి కూలిపోయిన భవనాల శిథిలాల కింద 2,100 మంది చిక్కుకు పోయా రని తాజాగా పాలస్తీనా కేంద్రం వెల్లడించింది. వేలాది మంది చిన్నారులు అదృశ్యమవ్వ డంపై పాలస్తీనా ఆందోళన వ్యక్తం చేసింది. గాజాలో వివిధ ప్రాంతాల్లో సుమారు 200 మంది మైనర్లు ఆచూకీ లేకుండా అదృశ్యమయ్యారు. ఇజ్రాయిల్ దాడుల వల్లే వారు గల్లంతయ్యారని అనుమానాలున్నాయని పాలస్తీనా కేంద్రం నివేదించింది. ఇజ్రాయిల్ దాడులకు గురైన అత్యంత ప్రభావితమైన ప్రాంతంలోనూ, మానవతా సహాయం కోసం ఎదురుచూసే ప్రదేశాల్లోనూ, ఆహారం కోసం వెతుకున్నప్పుడు గానీ పిల్లలు అదృశమయ్యారని పాలస్తీనా కేంద్రం నివేదిక వివరించింది.

# విజయ్ నామినేషన్‌లో లోపాలు

### మూడోసారి ప్రమాణ పత్రం సవరించి దాఖలు



చెన్నై: పెరంబూర్ నియోజకవర్గంలో సవరించిన ప్రమాణ పత్రాన్ని టీవీకే అధ్యక్షుడు విజయ్ తరఫున దాఖలుచేశారు. మొత్తం మీద మూడో సారిగా ఆయన నామినేషన్ పత్రంలో మార్పులు చేశారు. టీవీకే అధ్యక్షుడు విజయ్ అసెంబ్లీ ఎన్నికల్లో పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ నియోకవర్గాల నుంచి పోటీచేయనున్నారు. అందుకోసం రెండు నియోజకవర్గాల్లో నామినేషన్లు వేశారు. రెండు నామినేషన్లలో వేర్వేరు సమాచారం ఉంది. పెరంబూర్ నియోజకవర్గంలో వేసిన నామినేషన్‌లో, తనపై ఎలాంటి నేరాలు లేవని పేర్కొనగా, తిరుచ్చి ఈస్ట్ నామినేషన్‌లో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. అలాగే, రెండు నామినేషన్లలో విజయ్ వయస్సు వేర్వేరుగా ఉండడంతో, నామి నేషన్లు తిరస్కరణకు గురయ్యే అవకాశముందని న్యాయనిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో, టీవీకే న్యాయవాదుల తరఫున పెరంబూర్ ఎన్నికల అధికారులకు ఇప్పటికే దాఖలుచేసిన ప్రమాణ పత్రంలోని వివరాలు సవరించేందుకు అవకాశం కల్పించాలని గత నెల 30వ తేది వినతిపత్రం సమర్పించారు.

అనంతరం పత్రంలో వివరాలు సవరించి ఈ నెల 4వ తేది విజయ్ తరఫున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శివ, ఎన్నికల అధికారులకు సమర్పించారు. విజయ్‌పై ఉన్న కేసుల వివరాలు సవరించిన ప్రమాణ పత్రంలో పేర్కొన్నారు. ఈ క్రమంలో, నామినేషన్ దాఖలుకు చివరి రోజైన సోమవారంఎన్నికల అధికారికి మూడో కొత్త ప్రమాణ పత్రాన్ని విజయ్ తరఫున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి శివ అందజేశారు.

# భారత్‌ను కేంద్రప్రభుత్వం చీకటిలో ఉంచుతోంది

### రాహుల్ విమర్శలు



దిల్లీ : భారతదేశ డేటా సార్వభౌమాధికారం విషయంలో కేంద్రప్రభుత్వం దేశాన్ని చీకటిలో ఉంచుతోందని, అమెరికాతో కుదుర్చుకొన్న వాణిజ్య ఒప్పందాలపై పారదర్శకత పాటించడం లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందం వల్ల మన ఆరోగ్య, ఆర్థిక, ప్రభుత్వ డేటాబేస్‌లు భారత్‌లోనే ఉంటాయా? లేదా విదేశీ కంపెనీలకు మన డేటా సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెడుతున్నారా? అని రాహుల్ ప్రశ్నించారు. భారతదేశపు డేటా ప్రజలకే చెందుతుందని, కృత్రిమ మేథ(ఏఐ) రేసులో భారత్ ముందుండాలంటే మన డేటాను మనమే రక్షించుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

## మణిపూర్‌లో ఉద్రిక్తతలు ..
# బాంబుదాడిలో ఇద్దరు చిన్నారులు మృతి



ఇంఫాల్ : మణిపూర్‌లో మరోసారి ఉద్రిక్తపరిస్థితులు నెలకొన్నాయి. బిష్ణుపూర్ జిల్లాలో నిరసనకారులకు, పోలీసులకు మధ్య ఘర్షణ చెలరేగినట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఆగ్రహించిన పోలీసులు ఆందోళన కారులపై కాల్పులకు దిగారని అన్నారు. మంగళవారం తెల్లవారుజామున మొయిరాంగ్ ట్రోంగ్లాబి ప్రాంతంలో ఒక నివాసంపై అనుమానిత వ్యక్తులు జరిపిన బాంబుదాడిలో ఐదేళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి మరణించగా, తల్లికి తీవ్రగాయా లయ్యాయి. ఈ ఘటనపై ఆగ్రహించిన గ్రామస్తులు ఇంఫాల్ సహా పలు ప్రాంతాల్లో ఆందోళన చేపట్టారు. రహదారులను దిగ్బంధిం చారు. ఈ ప్రాంతంలో పెట్రోల్ బంక్ సమీపంలోని రెండు ఆయిల్ ట్యాంకర్స్, ట్రక్‌కు నిప్పటించారు. మోయిరాంగ్ పోలీస్ స్టేషన్ సహా ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ జిల్లాల్లో టైర్లను తగుల బెట్టి నిరసన వ్యక్తం చేశారు. బిష్ణుపూర్ జిల్లాలోని కేంద్ర బలగాల శిబిరంపై దాడి చేశారు. ట్రోంగ్లాయోబికి సుమారు 200 మీటర్ల దూరంలో ఈ శిబిరం ఉంది. ఆగ్రహించిన పోలీసులు వారిపై కాల్పులకు దిగడంతో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు.

# యుద్ధానికి శాశ్వత ముగింపు

**ఇరాన్ డిమాండ్**

**- తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'**

**హోర్ముజ్‌పై గుత్తాధిపత్యం శకం ముగిసిందని స్పష్టీకరణ**

**అమెరికా, ఇజ్రాయిల్ దాడుల్లో ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్‌సహా 25మందికి పైగా మృతి**



టెహ్రాన్, వాషింగ్టన్ : పశ్చిమాసియాలో నెల రోజులకు పైగా కొనసాగుతున్న యుద్ధాన్ని, ఘర్షణలు, ఉద్రిక్తతలను నివారించేందుకు ఉద్దేశించిన కాల్పుల విరమణకు సంబంధించిన ముసాయిదా ప్రణాళిక ఇరాన్‌కు అందిందని సీనియర్ ఇరాన్ అధికారి సోమవారం వెల్లడించారు. శాంతి ప్రతిపాదనను ఇరాన్ సమీక్షిస్తోందని, తాత్కాలిక కాల్పుల విరమణకు ఇరాన్ సుముఖంగా లేదని చెప్పారు. తాత్కాలిక కాల్పుల విరమణకు ప్రతిగా హోర్ముజ్‌ను తిరిగి తెరిచే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. శాశ్వతంగా యుద్ధాన్ని ముగించే ఒప్పందాన్ని కుదుర్చు కోవడానికి అమెరికా సంసిద్ధంగా లేదని ఇరాన్ భావిస్తోందని అన్నారు. రెండంచెల ముసా యిదా ప్రణాళికను పాకిస్తాన్ గత రాత్రి ఇరు పక్షాలకు అందజేసింది. ముందుగా తక్షణమే కాల్పుల విరమణను ప్రకటించి, ఆ తర్వాత సమగ్ర ఒపందాన్ని కుదుర్చుకోవాలని ఆ ముసాయిదా పేర్కొంటోంది. మధ్యవర్తుల ద్వారా ఇటీవల తమకు అందిన కాల్పుల విరమణ ప్రతి పాదనలపై ఇరాన్ తన వైఖరిని తెలియజేసిందని, అల్టిమేటమ్‌లు, షరతులు, బెదిరింపుల ద్వారా చర్చలు జరగవని స్పష్టం చేశారు.

## వచ్చే ఎన్నికల్లో 'కుక్కర్' పార్టీ ఉండదు

### కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం



చెన్నై: వచ్చే ఎన్నికల్లో 'కుక్కర్' పార్టీ ఉండదని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం తెలిపారు. కారైక్కుడి కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతుగా సోమవారం పలు ప్రాంతాల్లో కార్తీ చిదంబరం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... టీటీవీ దినకరన్ నేతృత్వంలో ఏఎంఎంకే పలు ఎన్నికల్లో పోటీచేసి పరాజయం చవిచూసిందన్నారు. బీజేపీ కూటమిలో ఏ పార్టీ చేరినా, ఆ పార్టీని బీజేపీ బాగా కొరికి మింగేస్తుందన్నారు. దినకరన్ తనకు మంచి మిత్రుడని, అందుకోసమే ఆయన కు సలహా ఇస్తున్నానని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో కుక్కర్ కమలంగా మారుతుందన్నారు.

### ఈస్టర్ నాడు నైజీరియాలోని రెండు చర్చిలపై దాడులు : ఏడుగురు మృతి

అబుజా :ఈస్టర్ నాడు నైజీరియాలోని రెండు చర్చిలపై దుండగులు దాడులు జరపగా ఏడుగురు మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి అవోన్ జిల్లా కౌన్సిలర్ మార్క్ బావా తెలిపిన వివరాల ప్రకారం.. మొదట నైజీరియాలో ప్రసిద్ధి చెందిన ఎసిడబ్ల్యు చర్చి, సెయింట్ అగస్టిన్స్ కాథలిక్ చర్చిలను గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి చుట్టుముట్టారు. చర్చికి వచ్చిన వారిపై విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల వల్ల ఏడుగురు మృతి చెందారు. గ్రామీణ ప్రాంతాల్లో టెలికమ్యూనికేషన్ల మౌలిక సదుపాయాలు సరిగ్గా లేకపోవడం వల్ల భద్రతా దళాలకు త్వరగా ఈ ఘటనకు సంబంధించిన సమచారం అందలేదు. దీంతో దుండగులు రెచ్చిపోయారు.

